జన రాజకీయం కోసం ...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి- 7 సంచిక - 8 పక్షపత్రిక ఏప్రిల్ 16-30, 2016

## మనం ఎన్నికల్లో గెలిచేదాకా ఈ దేశ భవిష్యత్తు నష్టపోకూడదు, 'ఎలక్షన్ హాలిడే' అస్త్రం మార్పే తప్ప రాజకీయ సన్యాసం కాదు



## పార్లమెంటు నుంచి పంచాయితీదాకా 'ఒకేసారి ఎన్నికలకు' లోక్‌సత్తా మద్దతు

## 'కేంద్రంలో నిర్మాణాత్మక అవిశ్వాసం, రాష్ట్రాల్లో ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక' అందుకు మార్గం




పుట్టుక నేపథ్యం బిడ్డ ఎదిగే అవకాశాలకు అవరోధం కాకుండా చేయగల నిజమైన శక్తి మంచి స్కూలు విద్యకు మాత్రమే ఉంది.

పాఠశాలల్లో ఖచ్చితమైన ఫలితాలు. ఏ కులమైనా, ఏ మతమైనా జేబులో నుంచి రూపాయి ఖర్చు చేయాల్సిన అవసరం లేకుండా నాణ్యమైన విద్యను పొందే అవకాశం ప్రతి బిడ్డకూ అందించటం ద్వారా మాత్రమే న్యాయం, అవకాశాలు, సమానత్వం వంటి లక్ష్యాల్ని సమాజం సాధించగలుగుతుంది.

- డా॥ జయప్రకాష్ నారాయణ్

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక ఏప్రిల్ 16-30, 2016

సంపుటి - 7 సంచిక - 8

## లోపలి పేజీల్లో...


మనం ఎన్నికల్లో గెలిచేదాకా ఈ దేశ భవిష్యత్తు. 5

లోక్‌సత్తా 2.0 - ఎలక్షన్ హాలిడే.................. 13

సరికొత్త పంథాలో లోక్‌సత్తా .................... 16

లోక్‌సత్తా భావాలు అజరామరం.................. 18

ఆయనతోపాటు మనమూ ఓడిపోయాము..... 19

ఇప్పుడు బాధ్యత పెరిగింది........................ 21

కరవును దేశప్రజల దృష్టికి తెచ్చిన లోక్‌సత్తా...... 22

ఉత్తరాఖండ్ పరిణామాలు ప్రేక్షకపాత్ర........... 23

అమెరికాలో ప్రజల ఆరోగ్య సంరక్షణ.............. 24

సన్నాహక కమిటీ, జిల్లా సదస్సులు............... 27

పటిష్ట వైద్యరంగమే ప్రజారోగ్యానికి బీమా....... 29

కొనుగోలుదారులు కోర్టుల చుట్టూ .............32

నల్లధనంపై యుద్ధానికి ఉగాది కొత్త స్ఫూర్తి..... 34



## సంపాదక వర్గం

డా॥ జయప్రకాష్ నారాయణ్
ప్రధాన సంపాదకులు

### సంపాదక వర్గం

బండారు రామ్మోహన్‌రావు
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి. కుటుంబరావు

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి


# ఒకేసారి ఎన్నికలకు మద్దతు, ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక కీలకం



లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల ఎన్నికలను దేశవ్యాప్తంగా ఒకేసారి నిర్వహించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, అధికార బీజేపీ చేస్తున్న ప్రతిపాదనను స్వాగతిస్తున్నాం. పార్లమెంటు నుంచి పంచాయతీ వరకు ఒకేసారి ఎన్నికలకు మద్దతుగా ఇప్పటికే లోక్‌సత్తా బృందం పార్లమెంటు స్టాండింగ్ కమిటీకి అభిప్రాయాల్ని కూడా సమర్పించింది. ఏటా ఏదోకచోట ఏవోక ఎన్నికలు జరుగుతుండటం వల్ల పార్టీ రాజకీయాలు ఎక్కువవుతూ పాలన తరచూ స్తంభించిపోతూ దేశ ప్రయోజనాలు దెబ్బతింటున్నాయి. అందుకే ఒకేసారి ఎన్నికల ప్రతిపాదనను ప్రాధాన్యాంశంగా పరిగణించాల్సుంది. అయితే 2019 ఎన్నికలలోగా ఏదోకరకంగా రాజ్యాంగ సవరణ చేసి ఒకేసారి ఎన్నికలను నిర్వహించినా, రాష్ట్రాల్లో అసెంబ్లీ రద్దయి మధ్యంతర ఎన్నికలు రావని గ్యారంటీ లేదు కాబట్టి, ఒకేసారి ఎన్నికల పద్ధతిని అమలుచేయాలంటే మౌలికంగా కొన్ని మార్పులు చేసుకోవటం అవసరం. 'ముఖ్యమంత్రుల్ని ఓటర్లే ప్రత్యక్షంగా ఎన్నుకోవటం, లోక్‌సభలో ప్రత్యామ్నాయ ప్రభుత్వ ఏర్పాటును చూపించే నిర్మాణాత్మక అవిశ్వాస తీర్మానాలను మాత్రమే అనుమతించటం' ఇందులో కీలకమైనవి. రాష్ట్ర సీఈవో (ముఖ్యమంత్రి)ని గనక ప్రత్యక్షంగా ఎన్నుకుంటే ఐదేళ్లకోసారే ఎన్నికలను నిర్వహించవచ్చు. అలాగే మనదేశ పరిస్థితుల దృష్ట్యా లోక్‌సభను మాత్రం ఇప్పుడున్న పద్ధతిలోనే ఎన్నుకోవటం అవసరం కాబట్టి, కేంద్రంలో సుస్థిరత కోసం నిర్మాణాత్మక అవిశ్వాస తీర్మానాలను మాత్రమే అనుమతించాలి. ప్రత్యామ్నాయ ప్రభుత్వ ఏర్పాటు ఉంటేనే ఉన్న ప్రభుత్వాన్ని కూలదోసే అవకాశం ఇవ్వాలి. ఇలా కేంద్రంలో నిర్మాణాత్మక అవిశ్వాస తీర్మానం, రాష్ట్రాల్లో ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక ద్వారా సుస్థిరత ఉంటే ఐదేళ్లకోసారి ఒకేసారి ఎన్నికలు సాధ్యమవుతాయి, ప్రభుత్వంలో నిజాయతీ, సామర్థ్యం పెరుగుతాయి. పంచాయతీ నుంచి పార్లమెంటు వరకూ ప్రజలు రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు అందించే కీలక సేవలపైనే.. అనుకూలంగానో, వ్యతిరేకంగానో ఓట్లు వేస్తున్నారు. రాష్ట్రాల్లోనే జవాబుదారీతనం ఉంది. పదవిలో కొనసాగటానికి ఎమ్మెల్యేల మీద ఆధారపడటం వల్ల ముఖ్యమంత్రులు నిరంతరం అభద్రతలో ఉంటున్నారు. ఇది పాలన మీద ప్రభావం చూపుతూ నిబద్ధతతను, సమర్థతను దెబ్బతీస్తుంటుంది. కాబట్టి రాబోయేతరం సంస్కరణ రాష్ట్రాల సామర్థ్యాన్ని, ఎదుగుదలను, జవాబుదారీతనాన్ని పెంచే విధంగా ఉండాలి. ముఖ్యమంత్రులను ఎమ్మెల్యేలుకాకుండా ప్రజలే ప్రత్యక్షంగా ఎన్నుకోవటం రాజకీయ పరివర్తన దిశగా కీలక అడుగు అవుతుంది.

## కార్టూన్ కార్నర్




## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ఫ్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ – 500 082

**ఫోన్ : 040-23310288**
**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: **040-23311816**

*విడి ప్రతి : రు. 10 ,*
*ఏడాది చందా : రు. 200*
*మూడేళ్ళ చందా : రు. 500*

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: *62007167836* ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు


| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

# మనం ఎన్నికల్లో గెలిచేదాకా ఈదేశ భవిష్యత్తు నష్టపోకూడదు, 'ఎలక్షన్ హాలిడే' అస్త్రం మార్పే తప్ప రాజకీయ సన్యాసం కాదు: జేపీ

**ఓటర్లకు ప్రస్తుతం సెకండ్ ఛాయిస్‌గా ఉన్న లోక్‌సత్తా పార్టీ ఫస్ట్ ఛాయిస్‌గా కనీసం 15-20శాతం ఓట్లు సంపాదించుకునేలోగా దేశ భవిష్యత్తు నష్టపోకూడదని, ఉన్న వనరుల్లో అత్యధిక ఫలితాలను సాధించేందుకే ఎన్నికల విరామాన్ని ప్రకటించామని, ఇది అస్త్రం మార్పే తప్ప రాజకీయ సన్యాసం కాదని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ స్పష్టంచేశారు. పార్టీలకతీతంగా రాజకీయ, పాలనా సంస్కరణోద్యమాన్ని కొనసాగిస్తామన్నారు. గత ఇరవయ్యేళ్ల సంస్కరణల కృషిని కొనసాగిస్తూనే ప్రస్తుత పరిస్థితులకనుగుణంగా మూడు నిర్దిష్ట లక్ష్యాలను ప్రతిపాదిస్తున్నట్టు చెప్పారు. రాష్ట్రాలకు మరిన్ని అధికారాలు, స్థానిక ప్రభుత్వాలకు వికేంద్రీకరణ, అందరికీ అందుబాటులో నాణ్యమైన విద్య, ఆరోగ్యం కోసం రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, వ్యక్తులను కలుపుకుని పోరాటం చేస్తామన్నారు. లోక్‌సత్తా 2.0పై ఎన్‌టీవీ 'పాయింట్ బ్లాంక్' కార్యక్రమంలో జయప్రకాష్ నారాయణ్ మాట్లాడారు.**

## ఎన్‌టీవీతో జేపీ ముఖాముఖి :




ఎన్‌టీవీ: ఏ రాజకీయ శక్తుల దోపిడీపై ప్రజల్లో చైతన్యం తేవాలనుకున్నారో, ఏ శక్తులకు వ్యతిరేకంగా లోక్‌సత్తా ఉద్యమం నుంచి లోక్‌సత్తా పార్టీగా వచ్చారో ఆ యుద్ధంలో జేపీ ఓడిపోయారా?

**జేపీ:** రుషీ! రాజకీయ పార్టీ ఓ వాహనం మాత్రమే. యుద్ధంలాగా భావిస్తే, యుద్ధభాషలో ఇదో అస్త్రం మాత్రమే. ఈ అస్త్రం చాలలేదు కాబట్టి, ఇంకో అస్త్రం తీసుకోవాలనుకుంటే ఓడిపోయినట్టా? ఇది కేవలం అస్త్రం మార్పు మాత్రమే. సమయం, సందర్భాన్ని బట్టి అస్త్రాలు మారతాయి. అన్నిటికీ ఒకే అస్త్రం పనికిరాదు. పిడుక్కి, బియ్యానికి ఒకే మంత్రం పనికిరాదు. నేను అప్పటికి, ఇప్పటికి చెప్పేది ఒకటే.. రాజకీయాన్ని లోక్‌సత్తా ఉద్యమం ఎప్పుడూ తిరస్కరించలేదు. రాజకీయం పవిత్ర వ్యాసంగం అనే భావాన్ని, భాషని తీసుకొచ్చింది ఈ దేశంలో నేను. రాజకీయంలో చేరితే చెప్పుతో కొట్టండన్న కొంతమంది మర్నాడు పోయి పదవులు పొందారు. నేను ఏనాడూ, లోక్‌సత్తా ఏనాడూ ఆ తప్పు చేయలేదు. రాజకీయం పవిత్ర వ్యాసంగం, రాజకీయంలో ఉన్న లోపాలకు, కుళ్లుకు విరుగుడు మరింత మంచి రాజకీయం, మరింత ఎక్కువ రాజకీయం అని తొలినుంచీ చెప్పాను, ఇప్పటికీ అదే చెబుతున్నాను. రాజకీయం అంటే ఓటు, మరింత అరవటం మాత్రమే అనుకుంటే పొరపాటు.

**(?) లోక్‌సత్తా స్వచ్ఛంద సంస్థ నుంచి ఎన్నికల కోసం ఆవిర్భవించినప్పుడు ఆనాడు మీరో మాట చెప్పారు. మార్పు కావాలంటే, రాజకీయ అధికారం రావాలి, ఓట్లు, సీట్లు కావాలి అన్నారు. సో, దాని కోసం.. అంటే ఎన్నికలు, ఓట్లు, కావాలి అన్నటువంటి మీరు ఇప్పుడేమో ఎన్నికలు అక్కర్లేదు అంటున్నారు.**

నేను అంటున్నది పొరపాటుగా అర్థం చేసుకున్నారు. నేను మొదట్నుంచీ చెప్పినటువంటివన్నీ కూడా టీవీల్లో ఉన్నాయి, పత్రికల్లో, రచనల్లో ఉన్నాయి. రాజకీయంలో పాలుపంచుకోవడం ఏనాడూ తప్పు కాదు, కానీ లోక్‌సత్తా ఉద్యమ సమయంలో పదేళ్లపాటు రాజకీయంలోకి మీరు వెళ్లండి అన్నా నేను కాదు అన్న కారణం ఏమిటంటే.. రాజకీయం పవిత్ర వ్యాసంగమే గానీ మనం దానికి సరిపడలేమేమోనన్న సంకోచం. ఆ తర్వాత ఎందువల్ల రాజకీయాల్లోకి రావాలన్న నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది అంటే.. లోక్‌సత్తా ఉద్యమం ప్రారంభించినప్పుడు మీకు గుర్తుందోలేదో, అసలు ప్రయివేటు టీవీ ఛానళ్లు లేవు, సోషల్ మీడియా లేదు, ఇరవయ్యేళ్ల క్రితం ఎలా ఉండేదో ఈవేళ యువతకసలు అర్థం కూడా కాదు. ఏదైనా విషయం మీద రిఫర్ చేయాలంటే పుస్తకం చదవాలి, గూగుల్ వంటి సదుపాయాలు లేవు. కానీ కాలక్రమేణా ఈ మాధ్యమాలు, మీడియా పెరగటం చేత, కాస్తోకూస్తో పట్టణీకరణ పెరగటం చేత, సంపద పెరగటం చేత, మధ్యతరగతి, చదువుకున్నవాళ్లు, యువత, పట్టణాలకు వచ్చినవాళ్లు– వీళ్లందరూ కూడా నిజంగా మార్పుని కోరుకుంటున్నట్టయితే మార్పుని కోరుకునేవాళ్లకి ఒక వేదిక కావాలి. అలా లోక్‌సత్తా పార్టీ వచ్చింది.

**(?) కుల, కుళ్లు, అవాంఛనీయ రాజకీయాలకు ప్రత్యామ్నాయంగా వచ్చిన మీరు అది సాధించలేక ఓడిపోయినట్టు ఒప్పుకోవాలి గదా**

సాధించలేకపోవటం కాదు. ఈ అస్త్రం ప్రస్తుతానికి పనికిరాదంటున్నాను. ఒక దేశంలో, సమాజంలో మార్పు అనేది ఒకతరంలో వచ్చేది కాదు.

**(?) ఇరవయ్యేళ్లయింది గదా**

ఇరవయ్యేళ్లు పెద్ద సమయమా? మాగ్నా కార్టా వచ్చి 801 సంవత్సరాలు అయింది. 1215లో వచ్చింది. ఆఫ్టరాల్ మన స్వతంత్ర భారత ప్రస్థానంలో 60 ఏళ్లు ఎంత? ఇరవయ్యేళ్లు లోక్‌సత్తా చేసింది తీసేయండి.. అరవై ఏళ్లలో చాలా గొప్పవి కూడా జరిగాయి. అన్నీ చెడిపోయాయి అనే వాణ్ణి కాదు నేను. దేశంలో ఎన్నో మంచివి జరిగాయని విజయాల్ని ఒప్పుకునేవాణ్ణి, గౌరవించేవాణ్ణి, గర్వించినవాణ్ణి. కానీ ఇంకా మార్పులు రావాలి, ఆ మార్పుల్ని వేగవంతం చేయాలి. మనం చేయవలసిన వాటికి ఇంకో వందేళ్లు పట్టకుండా మార్పుని వేగవంతం చేయాలి.

**(?) ఇరవయ్యేళ్లుగా జేపీ ఏదైతే చెబుతున్నారో అది ప్రజలకు అర్థం కాలేదా? ప్రజలకు అర్థమయ్యేట్టు చెప్పటంలో జేపీ విఫలమయ్యారా**

ఏదైనా అనుకోవచ్చు. నాకేం అభ్యంతరం లేదు. భారతదేశంలోని 125 కోట్ల మంది మనసుల్లో మార్పు తెచ్చే బాధ్యత ఒక్క జేపీది మాత్రమే, నాశనం చేయటం మిగతావాళ్లందరి హక్కు, ఈ అందరినీ ఇంత వేగంగా మారుస్తారు కాబట్టి 14 రకాల మౌలికమయిన సంస్కరణల్ని ఈదేశంలో తెచ్చినా కూడా జేపీ ఫెయిల్యూర్ అంటే నాకేం అభ్యంతరం లేదు. నాతరం మొత్తం ఫెయిల్యూరే, ఈదేశంలో 125 కోట్ల మందీ ఫెయిల్యూరే. ఆ ఫెయిల్యూర్‌కి అందరికంటే ఎక్కువ బాధ్యత తీసుకోమంటే తీసుకుంటాను.

**ఎన్‌టీవీ: కుల రాజకీయాలు, డబ్బు రాజకీయాలు, మతతత్వ రాజకీయాలు, వీటిన్నిటికీ వ్యతిరేకంగా లోక్‌సత్తా స్వచ్ఛంద సంస్థగా రావటం, ఆ తర్వాత రాజకీయ పార్టీగా మారటం.. ఈ ఇరవయ్యేళ్ల కృషి జరిగినా ఇవ్వాళ కూడా డబ్బులిచ్చి ఓట్లు కొంటున్నారు, డబ్బుతో గెలిచిన ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టి పార్టీలు లాక్కుంటున్నాయి, వృధా అయిపోయిందా జేపీ గారూ ఓ ప్రయత్నం ఈ 20 ఏళ్లలో? పవిత్ర వ్యాసంగంలాంటి రాజకీయం ఉదంతాలు కనిపించటం లేదు?**

**జేపీ:** ఎన్నో సందర్భాలలో ఉదహరించాను. జస్ట్ 50–60 ఏళ్ల క్రితం అమెరికాలో అధ్వాన్న రాజకీయాలను చేశారు.. న్యూయార్క్‌లోగానీ, ఫిలడల్ఫియాలోగానీ, చికాగోలోగానీ. ఇప్పుడు అక్కడ ప్రైమరీ ఎన్నికలు జరుగుతున్నాయి. ఆ డొనాల్డ్ ట్రంప్ అనే మనిషి.. వాళ్ల పార్టీ మనకనవసరం, వాళ్లెవరన్నది మనకనవసరం, కానీ ఆ భాషగానీ, ఆ ప్రవృత్తిగానీ, ఆ ద్వేషం నిండిన రాజకీయంగానీ మీరు ఊహించటం కూడా సాధ్యం కాదు. కొన్ని కోట్ల మంది ఆయా సందర్భాలలో అభద్రతా భావంతోగానీ, వాళ్ల ఆశలను, పరిస్థితుల బట్టిగానీ సమాజంగా స్పందిస్తుంటారు. దాన్ని బట్టి సమాజాన్ని మనం వెంటనే అంచనా వేయకూడదు. ఓటు అనేది ఒకటి మాత్రమే. కీలకమయినదే. నేను ఒప్పుకుంటా. కానీ అదొక్కటే కాదు సమాజంలో మార్పునకు దోహదం చేసేది. దాన్ని చూసి బెంబేలెత్తిపోకూడదు. అయ్యయ్యో ఇదేంటని అనుకోకూడదు.

**(?) చాలామంది విమర్శ ఏమిటంటే, ఇరవయ్యేళ్లలో ఇదీ పెద్ద ఉద్యమం అని చెప్పటానికి లోక్‌సత్తా చేసిందేమీ లేదని. అలా అడిగేవాళ్లకి సమాధానం ఏమిటి? కొన్ని ఉద్యమాలతో పోలిస్తే ఆ స్థాయిలో ఉద్యమం లోక్‌సత్తా ఏమి చేసింది అనిపిస్తుంది.**

అంటే, మనందరికీ ఏదోకరకంగా యాగీ చేసి పేపర్లలో హెడ్‌లైన్స్ తెచ్చుకుంటే అది ఉద్యమం. వాళ్లేమో బూతులు తిడితే న్యూస్ వేసేస్తారు. కానీ నిజంగా ప్రజల్లో ఆలోచనను పెంచి మౌలికమయిన మార్పులు తీసుకొస్తే అది ఉద్యమం కాదు. మీరు పెట్రోల్, డీజిల్ వాడుతుంటారు కదా? నెలకి ఎంత పెట్రోల్ బిల్లు అవుతుంది?

**(?) రూ.4,000-5,000 దాకా అవుతుంది**

మీకో విషయం తెలుసా? కేవలం లోక్‌సత్తా వల్ల నెలకు రూ.500 మీ పెట్రోల్ బిల్లు తగ్గింది. ఇరవయ్యేళ్ల క్రితం ఈదేశవ్యాప్తంగా పెట్రోలు బంకుల్లోని తూనికల్లో అవకతవకల వల్ల వినియోగదారులు 10శాతం వరకూ నష్టపోతుండేవారు. దానిపై లోక్‌సత్తా చేపట్టిన కార్యక్రమం వల్ల వారికి ఆ డబ్బు ఆదా అయింది. దీని గురించి మేం ఏమీ ఆర్భాటం చేయలేదు. రోజూ పెద్ద కటౌట్లు పెట్టటం లేదు, ప్రచార ఆర్భాటం చేయటంలా. కానీ ఈ దేశ ప్రజలకు చాలా చేశాం. రూ.3లక్షల కోట్ల ఆదాయం లోక్‌సత్తా చేసిన ఈ ఒక్క కార్యక్రమం వల్ల ప్రజలకు లభించింది. అది విజయమా? లేకపోతే హడావుడి, ఆర్భాటం చేసి విధ్వంసానికి పాల్పడి, రాస్తారోకోలు చేసి పోలీసు కాల్పులు, దహనకాండలతో ప్రజలను హింసించటం విజయమా? కొంచెం విచక్షణతో ఆలోచించాలి మనం.

**(?) ఎవరినుద్దేశించి అంటున్నారు**

ఎవరినైనా సరే. పాలనా సమాచార హక్కు చట్టం తెచ్చింది నేను, అరుణా రాయ్. అది విజయమా? లేకపోతే రోడ్ల మీద యాగీ చేయటం, బూతులు తిట్టుకోవటం విజయమా? అసెంబ్లీలో, పార్లమెంటులో బూతులు తిట్టుకోవటం విజయమా?

**(?) ఎన్నికల రణక్షేత్రంలో ఇప్పుడు ఏవైతే పార్టీలున్నాయో.. పేర్లు మార్పు అయివుండవచ్చుగానీ అన్నిటిదీ ఒకే రంగు, ఒకే వ్యవహారం. డబ్బు వెదజల్లటం, మద్యం పోయటం, ఎమ్మెల్యేలను కొనటం- వీరందర్నీ కాదని నాలాంటివాడు ఇంకో ప్రత్యామ్నాయం కోసం చూస్తున్నప్పుడు ఆ యుద్ధం నుంచి మీరు తప్పుకుని పారిపోతే ఎవరిని చూడాలి మనం? ఎవరి మీద ఆశలు పెట్టుకోవాలి?**

ఇది మంచి ప్రశ్న. కానీ ఇంకోరకంగా ఆలోచించండి. దానివల్ల ఫలితం వచ్చే దిశగా పెంచటం ఎట్లాగో ఆలోచించండి పౌరులుగా, ఓటర్లుగా. నేను చెప్పాను- లోక్‌సత్తా అందరికీ సెకండ్ ఛాయిస్ అయింది, గణనీయమైన ఓట్లతో అందరికీ ఫస్ట్ ఛాయిస్ అయిన రోజున ఇలాంటి రాజకీయం ఫలితాలను సాధిస్తుందని. ఇవాళకాకపోతే, రేపయినా ఒకచోట కాకపోయినా ఇంకోచోటయినా ఖచ్చితంగా ఇది జరిగితీరుతుంది.

**(?) జేపీ అనే ఆయన కంటిన్యూ అవుతూ, ఎన్నికల్లో పోటీ చేస్తూ నేను ప్రత్యామ్నాయంగా ఉన్నానని ఒక భరోసా ఇస్తే నాలాంటివాడికి రేపు అనే దాని మీద, రేపటి రాజకీయం మీద ఆశ ఉంటుంది. జేపీ గారూ! ఆ లేయర్ చచ్చిపోయిందిగా?**

పక్షపాత (పార్టీ) రాజకీయం తాత్కాలికంగా ఫలితాలనివ్వటం లేదు. అదొక్కటే పట్టుకుని దేశాన్ని నాశనం చేయటం తగదు.

**ఎన్‌టీవీ: పత్యామ్నాయం చెప్పండి దయచేసి?**

**జేపీ:** ప్రత్యామ్నాయం రెండు చెప్తాను ఈదేశంలో ఈ ఇరవయ్యేళ్ల అనుభవంతో. ఇప్పుడు సాధించాల్సిన మార్పుల కోసం నడుం బిగించటం, ఇంకోటి వాటిని సాధించటం ఎలాగో తెలుసుకుని ప్రయత్నించటం. ఎలా సాధించాలో నాకు తెలుసని మీకెవరికీ తెలియదు.

**(?) జేపీ అనే ఒక ఆశాకిరణం ఈ కుళ్లు పట్టిన రాజకీయ వ్యవస్థకు ప్రత్యామ్నాయంగా ఉంది అని ఎదురుచూసేవాళ్లకి.. అలాంటివాళ్లు చాలామంది ఉన్నారు, వాళ్లు ఎందుకు ఓట్లుగా, సీట్లుగా మారలేదు అనే కారణం పక్కనపెడితే, ఇవ్వాళరేపు వాళ్లకి ఒక బ్లాంక్ కాదా? ఒక శూన్యం మిగిల్చిపోవటం కాదా**

మీ ద్వారా రెండు మాటల్ని ప్రజలకు స్పష్టంగా చెప్పదల్చుకున్నాను. జేపీ కాదు ఆశాకిరణం, మీరు ఆశాకిరణం! మార్పు వచ్చేది నిజంగా మీరు అనుకున్నట్టయితే! మీ మనసులో ఉన్న భావానికి గొంతుని, ఓటుని ఇవ్వడం మొదలుపెడితే- ఈ ప్రత్యామ్నాయం సహజంగా వస్తుంది. రెండు- మీరొకవేళ ఆశాకిరణంగా నన్ను భావిస్తే, లోక్‌సత్తాని భావిస్తే, ఇలాంటి ప్రయత్నాల్ని భావిస్తే ఇవి ఎక్కడికీ పోవటం లేదు. కేవలం

అస్త్రాన్ని మారుస్తున్నామంతే.

**(?) అసలెందుకు వెళ్లిపోయారు? ఎన్నికల వ్యవస్థ అంటే నచ్చటం లేదా? లేకపోతే రాజకీయ వ్యవస్థ కుళ్లు పట్టి పోయిందనా? మీరనుకున్న పవిత్ర వ్యాసంగం సాధ్యంకాదని డిసైడై పోయారా? ఎందుకని? ఎందుకు మధ్యలో వదిలేశారు? మార్పు రాదని నిర్ణయించుకున్నారా**

ఖచ్చితంగా మార్పు వస్తుంది. ఈ రూపంలో మేం చేస్తున్న ప్రయత్నానికి తగిన మద్దతు కనిపించకపోవటం వల్ల మరోరూపంలో ఈదేశంలో మార్పు కోసం ప్రయత్నం చేస్తున్నాం, ఫలితాలను సాధిస్తాం.

**(?) ప్రజల మీద కోపమొచ్చిందా జేపీకి**

అలా అయితే నేను హాయిగా ఇంట్లో పడుకునేవాణ్ణిగా. మన ప్రజలు. దానిలో మనమూ భాగం. ఈ సమాజంలో నేనూ ఒక భాగం. నేను మళ్లీమళ్లీ చెబుతున్నా– మార్పు ప్రపంచమంతా కూడా చరిత్రలో ఒక్కరోజులో జరగలేదు. టెక్నాలజీని, సైన్సునీ చాలా వేగంగా.. ఈ వాచ్, లేకపోతే ఈ మొబైల్ ఫోన్ ఉంది, 3 నెలల్లో, 3 గంటల్లో వచ్చేస్తుంది మనకి. కానీ సమాజం మొత్తంలో భావాలు మారి వ్యవస్థ మారటం అనేది క్షణాల్లో జరగదు. చరిత్రను అర్థం చేసుకున్నాక కలిగిన భావన ఇది.

**(?) ఇవే మాటలు, ఇదే ఆశాభావంతో మీరు ప్రతి అడుగూ వేశారు. అనేక ఇంటర్వ్యూల్లో చాలాసార్లు ఇదే ప్రశ్నకు మీరు సమాధానం చెప్పారు**

అదే ఆశాభావంతో ఉన్నాను.

**(?) అదే ఆశాభావంతో మేం కూడా ఉన్నాం. కానీ సడెన్‌గా తలుపులు మూసేసి, షట్టర్ దించేసినాక అందరికీ బాధ కలుగుతోంది**

ఈ మొబైల్ ఫోన్ బాగాలేదయ్యా, వేరేదాన్ని పట్టుకుందామయ్యా అన్నాను. మీరేమో ఈ ఫోన్ ఎందుకు పట్టుకోవటం లేదు? ఈ ఫోన్ వదిలేశారు అంటున్నారు.

**(?) ఫోనే పక్కన పడేశారు మీరు**

పోనీ, ఫోన్ మారితే ఇంకోటొస్తుంది. కొత్త టెక్నాలజీ వస్తుంది. అది పెద్ద విషయం కాదు. నేను చెప్పేది– ఈ అస్త్రం గనక పనికిరాకపోయినట్టయితే లేదా ఆ అస్త్రాన్ని ఉపయోగించుకోవటం నాకు చేతకాకపోతే..

**(?) మీకే చేతకాకపోతే ఇంకెవరికి చేతనవుతుంది? ఎవడొస్తాడు? అది చెప్పండి సార్**

రెండూ కరెక్ట్ కాదు. అసలు వాస్తవం ఏంటంటే, ఈవేళ సమాజంలో ఇంకొంచెం మార్పు రావాలి. పరిస్థితుల్లో, ఆలోచనల్లో ఇంకొంచెం లోతుకావాలి. అదొచ్చినప్పుడు సహజంగా మారుతుంది. సెకండ్ ఛాయిస్ నుంచి ఫస్ట్ ఛాయిస్‌కి ఓ 15–20శాతం మంది రావాలి. అది రాగానే.. ఆరోజు వస్తుంది ఖచ్చితంగా, ఆరోజు ఎవరొచ్చినా కూడా ఖచ్చితంగా నేను ఎన్నికల్లో పాల్గొన్నా, పాల్గొనకపోయినా కూడా వాళ్లకు మద్దతిచ్చి గెలించే బాధ్యత తీసుకుంటా. కానీ 15–20శాతం మీకు ఫస్ట్ ఛాయిస్‌గా రాకుండా మాత్రం సాధ్యం కాదు. ప్రతిసారీ ఏమవుతోందీ.. నిజాయతీగా మాట్లాడుకుందాం.. వేలాదిమంది లోక్‌సత్తా కార్యకర్తలు, లక్షలాదిమంది ఓటు వేసినవాళ్లు నిరుత్సాహపడిపోతున్నారు. డీలాపడిపోతున్నారు. నేను చరిత్రగతిని అర్థం చేసుకున్నవాణ్ణి, దీర్ఘకాలిక వ్యూహాలు కలవాణ్ణి, దేశం కోసం ఏ లక్ష్యాలు కావాలో స్పష్టంగా అర్థం చేసుకున్నవాణ్ణి కాబట్టి నాకు డీలా లేదు. కానీ మామూలుగా చాలామంది సంస్థాగతంగా డీలాపడిపోతున్నారు. వాళ్లందరికీ మళ్లీ వెన్నుతట్టి అక్కడ్నుంచి ఎమోషనల్ డిప్రెషన్‌లో ఉన్నవాళ్లని పైకి తీసుకురావటం, మళ్లీ మొదలుపెట్టటం. దీనివల్ల నిర్వీర్యమయిపోతున్నారు. దీనికి బదులు నిర్మాణాత్మకంగా గనక సంఘటితం చేసి పార్టీలకతీతంగా సంఘటితం చేసి మూడు లక్ష్యాలను ప్రతిపాదిస్తున్నాను. దేశంలో ఇంతవరకూ ఎటువంటి అధికారం లేకుండానే లోక్‌సత్తా పలు మౌలిక లక్ష్యాలను ప్రతిపాదించింది, కొన్నిటిని సాధించింది. లోక్‌సత్తా సాధించినన్ని సంస్కరణల్ని, విజయాల్ని మరెవరూ సాధించలా. అవికాకుండా 20ఏళ్ల పరిణామాల్ని దృష్టిలో పెట్టుకుని ఈ తాజా ప్రతిపాదనలు. ఇరవయ్యేళ్ల క్రితం ఆనాటి ఏపీలో ఒక్కో అభ్యర్థికీ ఎన్నికల్లో రూ.50లక్షల నుంచి కోటి వరకూ ఖర్చవుతోందంటే ఉత్తరాదిలో నమ్మేవాళ్లు కాదు. మరీ ఎక్కువ చెబుతున్నారు సార్, అతిశయోక్తులు అనేవాళ్లు. ఇంత అధ్వాన్నమని తెలియదువాళ్లకి. ఆ తర్వాత అర్థమయింది. ఇవ్వాళ కోటి రూపాయిలంటే మీరే నవ్వుతారు. కుర్రాళ్లని చెబుతున్నారంటారు. ఇటీవల గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ ఎన్నికల్లో వెయ్యికోట్లు ఖర్చయ్యాయి. అమెరికాలో రాష్ట్రపతి

ఎన్నికలకు ఐదారు రాష్ట్రాల్లో కలిపితే కూడా ఇంత ఖర్చు కావటంలా. ఇది చాలా మామూలు అనుకుంటున్నాం. ఇది చాలా వికృతమైన పరిస్థితి. ఇరవయ్యేళ్లలో పరిస్థితి కొంత దిగజారింది. మేం ఇది కూడా అర్థం చేసుకోవాలి.

**(?) ఈ వికృత చేష్టల మధ్య, వికృత వ్యవస్థ మధ్య ఉండలేక, వ్యవస్థను మార్చలేం అని డిసైడైపోయి జేపీ దాన్ని అట్లా వదిలేసి వెళ్లిపోయారా**

దాన్ని మార్చటానికి మార్గం మరోటి ఏంటి అని ఆలోచిస్తున్నాను, నేను బైటపడుతున్నాను అంతే.

**(?) ఎందుకు మీరు ఆలోచించాలిప్పుడు? 2019 ఉంది, 2024 ఉంది, ఇంకా ఎన్నికలున్నాయి. ఓట్లున్నాయి. కనీసం మీవైపు చూస్తున్నవాళ్లు- సరే, మీ భాషలో వాళ్లలోనే చైతన్యం రావాలి, వాళ్లే ఆలోచించుకోవాలి- కానీ నాకెందుకని మీరు మధ్యలో వాళ్లని వదిలేస్తున్నారెందుకు**

మీరు అర్థం చేసుకోవటం లేదు నేను చెప్పేది. 1-2శాతం ఓట్ల వల్ల ప్రయోజనం లేని పరిస్థితిప్పుడు. 1-2శాతం సరిగ్గా గొంతు విప్పినప్పుడు, సంఘటితమయినప్పుడు సరైన ఫలితాలు నేను తీసుకొచ్చాను. ఆ ఫలితాలను తీసుకొస్తాను. రెండవది, ఇది ఎల్లకాలం ఇలా ఉండదు. రెండవ ఛాయిస్ నుంచి మొదటి 15-20శాతానికి ఖచ్చితంగా వస్తుంది. అన్నిచోట్లా ఒకేసారి రాకపోవచ్చు.

**(?) మీ కాలిక్యులేషన్ ఎలా చేస్తారు? మీ పార్టీ ఉంది కాబట్టి మీకు ఎంత ఓటింగ్ వచ్చింది అని లెక్క తెలుస్తుంది. ఇవ్వాళ మిమ్మల్ని పక్కనపెడితే అన్ని పార్టీలూ ఒకటే గదా? జనాల్లో ఆ చైతన్యం, మార్పు వచ్చినట్టు ఎలా తెలుస్తుంది**

పదేళ్లపాటు దీర్ఘకాలిక పోరాటం చేశాను- ఈ తోవలో రాజీలేని పోరాటం చేశాను. 20 ఏళ్లపాటు ఉద్యమంగా పోరాటం, 40 ఏళ్లకుపైగా ఈ జీవితంలో ఒక పౌరుడిగా పోరాటం చేశాను. ఈ దేశంలో నూటికి 80మంది పుట్టనప్పుడు పోరాటం చేశాను.

**(?) అలిసిపోయారా**

అలసిపోలా. కాబట్టి ఈయనెవరో ప్రజలకు తెలుసు. ఈ పోరాటంలో ఏనాడూ వెనుకంజ వేయలా. కాబట్టి మీరు నిజంగా మార్పుని కోరుకున్నట్టయితే మార్పు తేవాలన్న మనసులోని భావాన్ని చేపెట్టే బాధ్యత మీకున్నది. దానికి తగిన మార్గాలున్నాయి. ఈవేళ ఆధునికయుగంలో ఉన్నాం. అది అసాధ్యం కాదు. ఒపీనియన్ పోల్స్ ఉన్నాయి, మిగతా మార్గాలున్నాయి. ఆ మార్గాల్లో మేం నిజంగా ఫస్ట్ ఛాయిస్ కోసం ఉన్నాం, ఇది చాలా బాగుంది అని ప్రజలు చెప్పగలగాలి. ఇది చాలా బాగుంది కానీ.. , ఆ కానీలు వద్దు. ఇది బాగుంది, నా భవిష్యత్తు కోసం అని ఖచ్చితంగా వ్యక్తీకరించగలగాలి.

**(?) ప్రజల్లో మార్పురావటంలేదనే ఆవేదన, ఎక్కడో ఒక మూల ఒప్పుకోలేని చిన్న కోపం, ఆక్రోశం కనిపిస్తున్నాయి జేపీలో..**

నాకు కోపం, ఆక్రోశం ఏనాడూ లేవు. కాకపోతే వేగంగా జరగకపోతే దేశం నష్టపోతుందన్న బాధ ఖచ్చితంగా ఉంది.

**ఎన్‌టీవీ: రాజకీయ పార్టీగా మారినాక రాజకీయ నాయకుల్లా జేపీ మారలేకపోయారు. బ్యూరోక్రాట్‌లాగానే ఉండిపోయారు?**

**జేపీ:** కావచ్చు. రాజకీయ నాయకుడంటే ప్రజలకు ఏది అవసరమో, వచ్చే తరాలకి ఏం కావాలో వాటిపై ప్రజలకు నచ్చచెప్పే ప్రయత్నం చేయటమా, లేక తాత్కాలికంగా ప్రజల అవసరాలని ఉపయోగించుకుని ప్రజల బలహీనతలని ఆసరాగా చేసుకుని గద్దెనెక్కటమా? అది రాజకీయమైతే నేను చచ్చినా అలాంటి రాజకీయంలోకి వెళ్లను.

**(?) ఇవి చేయకుండా గద్దెనెక్కినవాళ్ల సంగతి**

వచ్చి మంచి చేస్తే నాకంటే సంతోషించేవారుండరు.

**(?) డబ్బు రాజకీయాలు చేయకుండానే ఏడాదిలోగా ఢిల్లీ గద్దె మీద కూర్చున్న కేజ్రీవాల్ గారు**

కానీ కేజ్రీవాల్ తాత్కాలిక ప్రయోజనాల రాజకీయాలు చేశారు. ఓట్ల కోసం సమాజాన్ని ఏదోకరకంగా పోలరైజ్ చేశారు దురదృష్టం కొద్దీ. అయినా కూడా మిగతావాళ్ల కంటే చాలా మెరుగు. దాన్లో అనుమానం లేదు. అందుకనే కేజ్రీవాల్‌ని నేను సమర్థించాను. మొన్న కూడా బేసి, ఢిల్లీలో సరి వాహనాల విధానం అంటే నేను సమర్థించాను.

**(?) జేపీకి, కేజ్రీవాల్‌కి కంపేర్ చేస్తే ఒప్పుకుంటారా**

చేసుకోవచ్చు, నాకభ్యంతరం లేదు. ఎవరితోనైనా కంపేర్ చేసుకునే వాక్స్వాతంత్ర్యం ఉంది. కానీ ఏ లక్ష్యాల కోసం

ఒక వ్యక్తి, ఒక ఉద్యమం కొన్ని పద్ధతులకు నిలబడిందో, ఏ విజయాలను ఆ వ్యక్తి సాధించాడు అనేది ముఖ్యం. నిజంగా విజయాలంటే అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే అనుకుంటే పొరపాటు. కొంచెం దీర్ఘకాలిక దృక్పథం ఉండాలి.

**(?) ముందుగా పార్టీ బాధ్యతల నుంచి కొంతమేరకు దూరమయ్యారు. జాతీయ అధ్యక్షుడి పదవి నుంచి. తర్వాత పార్టీ రాజకీయాల నుంచి, ఎన్నికల నుంచి దూరమవుతున్నారు. కాదా? అలా అనేవారికి ఏమిటి సమాధానం**

లోక్‌సత్తా సంస్థ బాధ్యతల నుంచి కూడా పూర్వం దూరమయ్యాను మీకు తెలుసోలేదో. కాబట్టి ఎప్పుడూ కూడా నేను సంస్థాగతంగా పెత్తనం చెలాయించాలనుకోలేదు. కొత్త నాయకత్వాన్ని తీసుకురావటానికి ప్రయత్నించాను. సంస్థాగతంగా పదిమందిని పెంచాలనే నా జీవితంలో ప్రయత్నిస్తుంటాను. ఏ సంస్థలో ఉన్నా అదే జరుగుతుంది. నేను ప్రభుత్వోద్యోగంలో ఉన్నప్పుడు మొట్టమొదటి అధికారుల సమావేశంలో అడిగింది.. ఎంతవరకు డెలిగేషన్ ఆఫ్ పవర్స్– అధికార విభజన, పంపిణీ జరిగిందని. ఏ ఉద్యోగినైనా అడగండి– మీరు సమర్థంగా పనిచేయటానికి ఎంతమేరకు అధికారాలు కావాలి అనే అడిగా. నా మొట్టమొదటి ఆర్డర్ ప్రతి ఉద్యోగంలో కూడా డెలిగేషన్ ఆఫ్ పవర్స్. ఇక మీరు చూసుకోండి అని వారికి తగిన అధికారాలనిచ్చి నేను చేయాల్సింది చేశా. అందుకే అన్ని విజయాలు సాధించాను. ప్రభుత్వంలో చేసిన ప్రతి విభాగంలో అన్ని ఫలితాలను సాధించానంటే, అధికారాలను సక్రమంగా పంపిణీ చేసి నిజమైన నాయకత్వ పంథాలో వ్యవహరించటం వల్లే. నాయకత్వం అంటే పెత్తనం చేయటం కాదు.

**(?) ఇన్ని విజయాలూ ఈ ఒక్క నిర్ణయంతో మరుగున పడిపోయినట్టు అనిపించటం లేదా**

నాకలా లేదు. ఈ మార్గంలో, ప్రస్తుతం ఈ అస్త్రం పనిచేయటం లేదు అనుకున్నాను. పనిచేస్తుందని నాకు నిజాయతీగా ఆధారాలు చూపించండి, తప్పకుండా అంగీకరిస్తాను. 1–2శాతం ఓట్లు కాదు, 20–30శాతం అని అంకెలు చూపండి, ఒప్పుకుంటాను. ఈదేశంలో రూ.100 కోట్లు ఖర్చుపెట్టినవాడు కాదు, నిజాయతీగా కష్టపడే సమర్థుడికే ఓట్లు పడుతున్నాయి అని సాక్ష్యాలు చూపండి, నేను ఒప్పుకుంటాను.. ప్రజలు చాలా స్పష్టంగా చెబుతున్నారు– ఈ పరిస్థితుల్లో మీరంటే ఎంత గౌరవమున్నా, ఎంత నమ్మకమున్నా మీరు మాత్రం మాకు సెకండ్ ఛాయిసే, ఫస్ట్ ఛాయిస్ కాదు అని.

**(?) ఎందుకని**

ఇది సమాజంలో పరిస్థితి. ఒక్కరోజులో మారిపోదు.

**(?) ఎందుకట్లా అయిపోతోంది? అందరూ డబ్బు చుట్టూ రాజకీయాన్ని..**

మన పేదసమాజంలో, పౌరసత్వం అంటే అవగాహన లేని సమాజంలో, అధికార కేంద్రీకరణ, ఓట్లేయగానే ఏదో దోచిపెడారనే భ్రమలు, తాత్కాలిక ఆకర్షణలు, తాయిలాల ఆశ, కొన్ని వేల సంవత్సరాలుగా కులం, మతం మన మనసుల్లో తీవ్రమైన ప్రభావం చూపుతున్నప్పుడు ఈ ప్రభావాలుంటాయి. కులమతాలు నా వల్ల, మీవల్ల రాలేదు..

**(?) సో, మేం ఒక డెసిషన్‌కి వచ్చేయచ్చా? ఇంక ఇది మారదని. జేపీయే దీన్ని మార్చలేక పక్కకి తప్పుకున్నారు, సో ఇంక ఇది మారదు అని చెప్పి..**

చాలా పొరపాటు. చాలా పొరపాటు. చాలా స్పష్టంగా మీ ద్వారా ప్రజలకు తెలియచేస్తున్నాను. ఈ సెకండ్ ఛాయిస్ ఫస్ట్ ఛాయిస్‌గా మారి 15–20శాతం ఓట్లు వస్తే..

**ఎన్‌టీవీ: రావట్లేదు గదా?**

**జేపీ:** వస్తుంది. ఎల్లకాలం ఇట్లా ఉండదు. భారతదేశం ఒక దేశం అని సులభంగా అంటున్నాంగానీ, ఒక 40–50 దేశాల సముదాయంగా ఉంటోంది మానసికంగా. ఇంత పెద్దదేశంలో ఇక్కడ లేకపోతే అక్కడ, అక్కడ లేకపోతే ఇంకోచోట మార్పు వస్తుంది. వాస్తవానికి స్వతంత్ర పోరాటంలో ఏమిటి మహాత్మాగాంధీ, ఇతర జాతీయోద్యమ నేతలు చేసింది?– మాకు ఇన్ని వేల ఏళ్ల చరిత్ర, సంస్కృతి ఉన్నాయి, స్వయంపాలన చేసుకుంటాం అని. కానీ దానికి 90 ఏళ్లు ఎందుకు పట్టింది? టెక్నాలజీ మారినంత వేగంగా వ్యక్తుల భావాలు మారతాయిగానీ సమాజం మొత్తం మారదు. సమయం పడుతుంది.

**(?) ఏ పార్టీ అయినా, పార్టీ పేర్లు చెప్పనక్కర్లేదు.. 10 పార్టీలు ఒకే తీరుగా వెళ్తున్నాయి. ఓట్లు, సీట్లు, డబ్బు, కులం, తాత్కాలిక తాయిలాలు– దానికి కాస్త భిన్నంగా.. కాస్తకాదు చాలా భిన్నంగా లోక్‌సత్తా, కేజ్రీవాల్ అంటున్నారు. మరి ఆయన చెప్పిందాంట్లో తప్పేంటి**

ఖచ్చితంగా నూతన రాజకీయం తీసుకురావటంలో ఈ పోరాటం జరగాలి. కానీ ఉన్న వ్యవస్థ మూలాల్ని నరికివేయటమన్నది కరెక్టు కాదు. మనకు ఆవేశం ఉంది కదా అని చెప్పి ఉన్న చెట్టును నరుక్కుంటామా? కూర్చున్న కొమ్మను నరుక్కునేవాడు మూర్ఖుడవుతాడు. మనకు ఈదేశంలో సుప్రీంకోర్టు ఉంది. సుప్రీంకోర్టులో తప్పుల్ని నేను బైటపెట్టినట్టుగా ఇంకెవరూ బైటపెట్టలేదు. మొన్నటికిమొన్న 99వ రాజ్యాంగ సవరణను తీసుకొస్తే అది తప్పని సుప్రీంకోర్టు తీర్పునివ్వటం తప్పని నిర్ద్వంద్వంగా చెప్పింది నేనొక్కడ్నే. ఇప్పటికీ ఆ మాటని బహిరంగంగా చాలామంది చెప్పలేకపోతున్నారు. సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల అవినీతిపై నా ఎదురుగా వేదిక మీద ఉన్నత న్యాయమూర్తులు కూర్చున్నప్పుడుకూడా బహిరంగంగా ప్రశ్నించాను నేను. అదేసమయంలో సుప్రీంకోర్టు నాశనం కావాలని కోరుకుంటానా? కాదు. తప్పుల్ని సవరించాలి. కానీ బాధ్యతాయుత వ్యవస్థను, యంత్రాంగాన్ని నిర్మించి ఆ రాజ్యాంగవ్యవస్థను బలోపేతం చేసుకోవాలి, కాపాడుకోవాలి.

**(?) ఉద్యమంగా జేపీ అనేక విజయాల్ని సాధించారు. మళ్లీ ఇప్పుడు ఉద్యమంగా వచ్చి విజయాల్ని సాధించబోతున్నారు. అంతేనా**

99వ రాజ్యాంగ సవరణ వచ్చింది 2015లో. అది నా విజయం. సహకార సంఘాల స్వతంత్ర ప్రతిపత్తి చట్టం వచ్చింది 2012లో. స్థానిక న్యాయాలయాల చట్టం వచ్చింది 2009లో.

**(?) ఇది రాజకీయ పార్టీగా లోక్‌సత్తా సాధించిన విజయమా? జేపీ సాధించిన విజయమా?**

ఇదంతా రంధ్రాన్వేషణ. విజయం సాధిస్తే ఇన్ని వంకలు పెడితే ఎలా? విజయం సాధించకపోతే, దేశాన్ని నాశనం చేస్తే అంతా మౌనంగా ఉంటారు. దేశానికి పనికొచ్చే విజయాలు సాధిస్తే దానికి మీరిలా వంకలు పెడితే ఎట్లా?

**(?) విజయాలు ఎక్కువ కోరుకుంటున్నారు మీ ద్వారా..**

ఎగ్జాక్ట్‌లీ. నేను గర్వపడేది.. ఈవేళ నేను చనిపోయినా, ఈవేళకాకపోయినా రేపయినా చరిత్ర గుర్తించేది– లోక్‌సత్తా మూలంగా దేశంలో ఏ పార్టీ, ఏ సంస్థా సాధించనన్ని విజయాల్ని స్పష్టంగా సాధించగలిగాం అని. కానీ అవి చాలవు. ఏనాడూ కూడా ఎందుకని ఈ విజయాలకి నేను ప్రచారం కల్పించలేదు అంటే.. సాధించినదానికి నాకు ఏనాడూ తృప్తి లేదు. ఇది ఎంత అవసరమైనా కూడా సాధించాల్సింది చాలా ఎక్కువ అనే స్పృహ నాలో ఉంది.

**(?) ఇది ప్రజలకు అర్థమవ్వాలి గదా. అర్థమై ఉంటే రాజకీయంగా మీరనుకున్నట్టు అధికారంలోకి వెళ్లే అవకాశం వచ్చేది**

కొంతమందికి ఈ ప్రచారం, ఆర్భాటం అంటే గిట్టవు.

**(?) మంచికోసమే ప్రచారం..**

మీరు చేయండి ఆ పని. మీరు జనాలకు కావల్సినవి, చేయాల్సినవి వివరించండి.

**(?) జేపీ ఎక్కడ మాట్లాడినా అక్కడ ఓ 20 కెమేరాలైనా ఉండవా**

స్వోత్కర్ష తప్పు అని నేను నమ్ముతాను

**(?) మీరు చెప్పనక్కర్లా..**

మీరు చెప్పండి. మీకు చెప్పడం చేతకాకపోతే నన్ను అనకండి

**ఎన్‌టీవీ: పార్టీ ఫెయిలయిందా?**

**జేపీ:** పార్టీ వాళ్లు కూడా చెప్పనక్కర్లా

**(?) నాయకుడు, కార్యకర్తలు అనే ఒక వ్యవస్థ ఉంటుంది..**

విజయాన్ని సాధించలేదు అంటారు, సాధిస్తే రంధ్రాన్వేషణ చేస్తారు, ఆ తర్వాత ప్రచారం ఎందుకు చేసుకోలేదు అంటారు. భారతదేశంలో 125 కోట్లమంది ఉన్నారు. జయప్రకాష్ నారాయణ్ అనేవాడు ఒక వ్యక్తి. పార్టీకున్న కొన్ని లక్షలమంది ఈదేశంలో కేవలం కొంతమంది.. కాస్త ఆలోచన ఉన్నవాళ్లకిలోక్‌సత్తా ఏం ఆలోచిస్తోందో, ఎందుకోసం చేస్తోందో తెలియదా? అంతకంటే ఏమన్నా చెప్పాల్నా? ఒక మనిషి తన గురించి తాను చెప్పుకోవటం ఎంత చౌకబారు? మీ గురించి ఇతరులు చెప్పుకోవాలి, మీ వల్ల మంచి అనుకుంటేవాళ్లు గుర్తించాలి. వద్దనుకుంటే కానివ్వండి.

**(?) డా॥ జేపీతో బ్యూరోక్రసీ పాలిటిక్స్ ముగిసిపోయినట్టేనా**

నేను బ్యూరోక్రాట్‌గా ఉండగా కూడా బ్యూరోక్రాట్‌లా ఎప్పుడూ

ప్రవర్తించలేదు. అందరికీ తెలుసు ఆ సంగతి. బ్యూరోక్రాట్‌లా ఈ రూల్స్, ఈ లైన్ దాటకూడదు, పైవాడి ఆదేశాల్ని ఉల్లంఘించకూడదు, సేఫ్టీ ఫస్ట్ అన్నట్టు వ్యవహరించలేదు. ఎన్నో సందర్భాలలో నేను చట్టాలను కూడా ఉల్లంఘించాను. బహిరంగంగా ఈమాట మొదటిసారి చెబుతున్నాను. ప్రజల ప్రయోజనాల కోసం చట్టం కూడా తూ నా బడ్డు అని కాగితం మీద రాసి మరీ చేసినా, ఒక్కడు కూడా వేలెత్తి చూపలా. 453 లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలను ప్రకాశం జిల్లాలో సాధించాను. నేను బ్యూరోక్రాటిక్‌గా వ్యవహరించి ఉంటే అందుకోసం 1000 ఏళ్లు పట్టేది. ఉన్న చట్టాల పద్ధతిలో సాధ్యం కాదని తెలిశాక 1గంటలో మొత్తం ఎత్తిపోతల పథకాలకు క్లియరెన్స్ ఇచ్చేశాను. అది బ్యూరోక్రాటిక్ పద్ధతా? సహకార సంఘాలకు ఎన్నికలు పెట్టకపోతే ముఖ్యమంత్రితో పోట్లాడి సాధించా. ఎందుకయ్యా అధికారులుండగా ఎన్నికలు అన్నాడాయన. మీరు నాకంటే తెలివైనవారు కాదు, నాకంటే సమర్థత ఉన్నవారు కాదు, అయినా మీ మాటను నేను ఎందుకు గౌరవిస్తున్నాను? అనడిగా. ఎందుకంటే, మీరు ఎన్నిక ద్వారా నెగ్గారు, మీకు ఆ లెజిటమసీ ఉంది కాబట్టి అని సమాధానమిచ్చాను. దాంతో ఆయన మారుమాట్లాడకుండా ఎన్నికలకు అంగీకరించారు.

**(?) 1-2శాతం మీకు ఓట్లు వేస్తున్నవాళ్లు ఏం చేయాలి? వాళ్లకు ప్రత్యామ్నాయం ఏమిటి**

నేను ఓటు వేస్తాను, మీరు ఓటు వేయండి. ఖచ్చితంగా ప్రత్యామ్నాయం కోసం మనం పోరాటం చేద్దాం దీంతో. ఉన్నంతలో మంచివారికి ఓటు వేద్దాం. ఎవరూ లేరంటే 'నోటా' ఉంది. కనీసం ప్రొటెస్ట్ ఉంటుంది. ఓటు వేయకపోవటం పరిష్కారం కాదు. కంపల్సరీ ఓటింగ్ కావాలి అని కోరుతున్నవాడిని నేను. ప్రత్యామ్నాయ రాజకీయం పెరగాలి అంటే సెకండ్ ఛాయిస్ నుంచి మంచి రాజకీయానికి ఫస్ట్ ఛాయిస్‌లో 15-20శాతం ఓట్లు రావాలి. ఆ పరిస్థితులు వస్తే, ఎవరు ఎక్కడ్నుంచి వచ్చినా కూడా ఈదేశంలో వాళ్లకు అండగా ఉండి, వాళ్లకు మద్దతిచ్చి గొంతునిచ్చి పెంచేందుకు పోరాటం చేసి విజయం సాధించేలా చేసే బాధ్యత నాది.

**(?) అంతేగానీ లోక్‌సత్తా పార్టీ మళ్లీ ఎన్నికల్లోకి రాదా**

అది లోక్‌సత్తా పార్టీ నిర్ణయించుకోవాలి సమయం, సందర్భం వచ్చినప్పుడు. కానీ ఈవేళ్టి పరిస్థితుల్లో ఈ ఫస్ట్ ఛాయిస్‌గా 15-20శాతం రానప్పుడు ఎన్నికల్లో పోటీ వల్ల ఏమీ ప్రయోజనం ఉండదు.

**(?) లోక్‌సత్తాకు, జేపీకి సంబంధం లేదా మీరు చెప్పినదాన్ని బట్టి**

పార్టీలో నిర్ణయాలు నేనసలు తీసుకోవటమే మానేశాను

**(?) అంటే అసలు పట్టించుకోవటమే మానేశారా**

పూర్తిగా

**(?) సో, లోక్‌సత్తా వేరు, జేపీ వేరు ఈ నిముషం నుంచి..**

అలా అని కాదు నేను చెబుతున్నది. మహాత్మాగాంధీ, కాంగ్రెస్ పార్టీ ఎంతమేరకు వేరు, నేనూ అంతమేరకే వేరు. ఖచ్చితంగా. ఆయనకి పార్టీ సభ్యత్వం కూడా లేదు.

**ఎన్‌టీవీ:** అంచేత మీరు చేసే ఉద్యమం డా॥ జేపీగా చేయబోతున్నారు, అంతేనా?

**జేపీ: లోక్‌సత్తా బ్యానర్‌ని వాడకుంటాను. లోక్‌సత్తా ఉద్యమం ఉంది.**

**(?) సంబంధం లేదు..**

లోక్‌సత్తాతో సంబంధం లేదనలేదు. ఇంతకుముందు సమాధానం ఏం చెప్పాను?

**ఎన్‌టీవీ: పార్టీలో నిర్ణయాలు వాళ్లు తీసుకుంటారని..**

జేపీ: ఖచ్చితంగా. కాబట్టి సంబంధం లేదని ఎట్లా అంటాను? సంబంధం ఉండొచ్చుగానీ నేను వాళ్లని శాసించను. రోజువారీ వ్యవహారాలు, పార్టీ నిర్ణయాలతో సంబంధం ఉండదంతే. ఖచ్చితంగా లోక్‌సత్తా ఉద్యమం వేదికగా పోరాడతాను. ఇతర సంస్కరణలతోపాటు నిర్దిష్టమైన ఈ మూడు లక్ష్యాల కోసం పోరాడతాను. ఇప్పటిదాకా ఎలాగైతే 14-15 మౌలికమైన విజయాల్ని సాధించామో ఖచ్చితంగా నాకు ప్రకృతిగనక వయసు ఇచ్చినట్టయితే, ఆరోగ్యం ఇచ్చినట్టయితే నేను సాధిస్తాను నా కళ్లతో. లేదంటే భావజాలంలో పదునుండి, బలం ఉంది అనుకున్నట్టయితే తర్వాతి తరం అంతకంటే ఎక్కువగా సాధించుకుంటుంది. పూర్తిగా నాకు ఆ నమ్మకం ఉంది. ❐

# లోక్‌సత్తా 2.0 - ఎలక్షన్ హాలిడే



పంట పండక, పండినా గిట్టుబాటుకాక కొన్నేళ్ల క్రితం తెలుగునాట కొందరు రైతులు క్రాప్ హాలిడే ప్రకటించినప్పుడు పట్టణ ప్రాంతాలలో, వ్యవసాయేతర రంగాలలో ఉన్నవారు కూడా ఎంతో వేదన చెందారు. ఈవేళ లోక్‌సత్తా పార్టీ ఎన్నికల హాలిడే ప్రకటించినప్పుడు కూడా చాలామంది మిత్రులు అలాగే బాధను పంచుకుంటున్నారు, అనేక ప్రశ్నల్ని లేవనెత్తుతున్నారు. కానీ వ్యక్తులకన్నా పార్టీ ముఖ్యం, పార్టీకన్నా దేశం ముఖ్యం అనే మాటల్ని నాలుక మీదే కాకుండా ఆచరించి చూపాలి అంటే.. ఈ నిర్ణయం అవసరం, అనివార్యం. నాయకులు, వాళ్ల వారసులు, అనుచరుల చుట్టూనే తిరుగుతుండే భారత రాజకీయాల చర్చను, భాషను మార్చి రాజ్యాంగం, పౌరసత్వం ఆయుధాలుగా జనం చుట్టూ తిరిగే కొత్త రాజకీయానికి నాంది పలికిన లోక్‌సత్తా పార్టీ 1996-97లో ఒక ఉద్యమంగా మొదలైంది. పెట్రోలు బంకుల్లో తూనికల మోసాన్ని అరికట్టేందుకు ఎంతో ఒడుపుగా చేసిన ఒక చిన్న ప్రయత్నంతో లోక్‌సత్తా కార్యక్రమాలు మొదలయ్యాయి. ఆ ప్రయత్నం వల్ల తూనికల మోసాలకు దేశవ్యాప్తంగా తెరపడింది. దీనివల్ల ప్రజలకు ఎంత సొమ్ము ఆదా అయిందని ఉజ్జాయింపుగా లెక్క తీస్తే, ఇప్పటికి రూ.3లక్షల కోట్లు వరకూ అని తేలింది. అలా ఓటర్ల జాబితా ప్రక్షాళన, అభ్యర్థుల నేరచరిత్రని ప్రకటించే చట్టం (2003), మంత్రివర్గ సభ్యుల సంఖ్యను కుదించే ఏర్పాటు (91వ రాజ్యాంగ సవరణ), పాలనా సమాచార హక్కు చట్టం (2005), జాతీయ ఆరోగ్య మిషన్ (2005), స్థానిక న్యాయాలయాల చట్టం (2009), సహకార సంఘాల స్వయంప్రతిపత్తి (97వ రాజ్యాంగ సవరణ), 2 జీ స్పెక్ట్రం లైసెన్సుల రద్దు- సహజ వనరుల వేలం పాట విధానం (2013), లోక్‌పాల్ చట్టం (2014), ఉన్నత న్యాయమూర్తుల నియామకం కోసం జాతీయ జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్స్ కమిషన్ (2015) లాంటివి లోక్‌సత్తా తర్కం, దార్శనికత, సామరస్యతతో సాధించిన విజయాలకు కొన్ని ఉదాహరణలు మాత్రమే. సహజ వనరుల వేలం వల్ల ఈదేశానికి రూ.3లక్షల కోట్లు రావటాన్ని "ఫోర్బ్స్" పత్రిక ప్రశంసించిందని ఇటీవల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పార్లమెంటులో ప్రకటించిన విధానం కూడా లోక్‌సత్తా 2జీ లైసెన్సులపై చేసిన పోరాటం నుంచి వచ్చిందే.

లోక్‌సత్తా ఒక ఉద్యమంగా ఉన్నా, పార్టీగా వచ్చినా భావజాలం ఒకటే. వేరుగా ఉండే అవకాశమే లేదు. అయితే ఉద్యమంగా మాత్రమే లోక్‌సత్తా ఉన్నప్పుడు ఒక పరిధి దాటి రాజకీయ పార్టీలను సంస్కరించటం అసాధ్యంగా ఉండేది. అందుకే రాజకీయ పార్టీగా కూడా లోక్‌సత్తా వస్తే, ఎన్నికల అక్రమాలను, రాజకీయ సంస్కృతిని, వంశపారంపర్య రాజకీయాలను మార్చి ఈదేశంలో ప్రజలందరికీ భాగస్వామ్యముండే అభివృద్ధి రాజకీయాన్ని ప్రతిష్ఠించవచ్చని భావించారు. ఇంటి స్థలం, పింఛను కూడా వదులుకుని వయసు, కెరీర్ ఉచ్చదశలో ఐఏస్ పదవికి రాజీనామా చేసి ప్రజాస్వామ్య సంస్కరణల కోసం లోక్‌సత్తాని స్థాపించిన డా॥ జయప్రకాష్ నారాయణ్ ఆ ఉద్యమాన్ని పార్టీగా మార్చటం కోసం 150-200 నిద్రలేని రాత్రులు గడిపారు. రాజకీయాల రొచ్చులోకి ఎందుకు అని పలువురు హితైషులు హెచ్చరించారు. పచ్చికాయను మాగపెడుతున్నారేమో అని వాదించారు. అయినా మార్పు కోరుకునే వారి మధ్యతరగతి, పట్టణ ప్రాంత ప్రజలు, యువత సంఖ్య 15-20శాతం ఉంది కాబట్టి ఆమేరకు నిలకడగా ప్రతి ఎన్నికలో ఓట్లు పడుతుంటే సాంప్రదాయ పార్టీలు విధిగా దారికొచ్చి సంస్కరణలను చేపడతాయని జేపీ భావించారు. చివరికి జేపీ అభిప్రాయంతో ఎక్కువమంది సహచరులు ఏకీభవించటంతో లోక్‌సత్తా పార్టీ 2006లో ఆవిర్భవించింది. మంచి చేయాలనే సంకల్పం తప్ప మరే

అనుభవం లేని వాళ్లు తొంభైశాతం ఉండటంతో పార్టీ సంస్థాగతంగా చాలా ఒడిదుడుకులను ఎదుర్కొంది. అన్ని విభాగాలలో అందరికీ అవగాహన పెంచేందుకు, పదవుల పట్ల వ్యామోహం లేని పనిసంస్కృతిని పెంపొందించేందుకు సంస్థాగతంగా రకరకాల నేపథ్యాలు, మనస్తత్వాలున్న వారిని కలుపుతూ తరచూ మార్పులు చేస్తూ వచ్చింది లోక్‌సత్తా. ఈ క్రమంలోనే పార్టీ అధ్యక్ష పదవికి రహస్య బ్యాలెట్ పద్ధతిని ఏర్పాటు చేసి తాను కూడా ఒక పోటీదారుగా జేపీ నిలబడ్డారు. పార్టీకి ఒక అంబుడ్స్‌మన్‌ని ఏర్పాటు చేశారు. ఒక నిజాయతీ రాజకీయ పార్టీ మనుగడ సాగించగలదని కాలక్రమంలో లోక్‌సత్తా నిరూపించింది. నిజాయతీ డబ్బుకి పన్ను విరాళాలుండటంతో (ఈ చట్టం కూడా తెహల్కా స్టింగ్ ఆపరేషన్ నేపథ్యంలో లోక్‌సత్తా కృషి వల్లే వచ్చింది) లోక్‌సత్తా సంస్థాగత వ్యవహారాలకు తగ్గ నిధులను సమీకరించగలిగింది. కానీ ఎన్నికల దగ్గరికొచ్చేసరికి ధన రాజకీయాల తాకిడిని తట్టుకోవటం కష్టసాధ్యమైంది. వనరులు చాలలేదు, మీడియా మద్దతు లేదు. దీనికితోడు లోక్‌సత్తా ఆశించిన 15-20శాతం ఓట్లు కూడా ధన రాజకీయ పార్టీల పరిమితిని దాటలేకపోవటం పెద్ద ప్రతిబంధకమైంది. 2007లో లోక్‌సత్తా మొదటిసారిగా జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో పోటీ చేసింది. అప్పట్లో గోదావరి జిల్లా ఉంగుటూరులో ఓపెన్ ప్రైమరీని (అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల మధ్యే నిర్వహించే ప్రాథమిక వడపోత ఎన్నికలాగా) నిర్వహించింది. ఇందులో 9,000మందికి పైగా ప్రజలు ఓట్లేసి లోక్‌సత్తా అభ్యర్థుల మధ్యే ఒకరిని ఎన్నుకున్నారు. ఆయన్నే లోక్‌సత్తా తన అభ్యర్థిగా ప్రకటించినా పార్టీకి వచ్చిన ఓట్లు ఓపెన్ ప్రైమరీలో వచ్చినవాటిలో సగం కూడా లేవు. అదేసమయంలో రాయలసీమ పిచ్చాటూర్, తెలంగాణ ప్రజ్ఞాపూర్ లాంటి చోట్ల, తెనాలి మునిసిపల్ వార్డు ఉప ఎన్నికలో వంద లోపే ఓట్లు వచ్చాయి. రెండు ప్రధాన సాంప్రదాయ పార్టీల తర్వాత సుదూర మూడో స్థానం ఓట్లే లోక్‌సత్తాకి వచ్చాయి. కూకట్‌పల్లిలో జేపీ గెలిచినా అది రొమాంటిసిజమే తప్ప అవగాహనతో వేసిన ఓటు కాదని ఆ తర్వాత మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో తేలింది. అందుకే తన గెలుపుని కొత్త రాజకీయానికి కీలక మలుపుగా జేపీ భావించలేకపోయారు. లోక్‌సత్తాకి 10-20శాతం ఓట్లు వచ్చి ఉంటే రాష్ట్ర భవిష్యత్తు మరోలా ఉండేదని ఆరోజు కూడా చెప్పారు. 2014 ఎన్నికల్లోనూ, 2015 జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనూ ఇదే సరళి కొనసాగింది.

క్షేత్రస్థాయిలో పట్టణ ప్రాంతాలలో లోక్‌సత్తా పట్ల ప్రజల ఆదరణ, ఏ అంశంపైనైనా లోక్‌సత్తా విధానానికి మద్దతు మాత్రం తగ్గలేదు. అధికారంలో లేకపోతే ఇక పార్టీ అనవసరం అనే పరిస్థితి లోక్‌సత్తాకు లేదు. ఈవేళ తెలంగాణలో, మరికొన్ని చోట్ల చూస్తున్నాం.. జెండాలు తప్ప అవినీతి, వంశపారంపర్య రాజకీయాల్లో, చివరికి నాయకుల్లో కూడా అధికార పార్టీతో తేడాలేని పార్టీలు ఎందుకు? అనే ప్రశ్నను ప్రతిపక్ష సాంప్రదాయ పార్టీలు ఎదుర్కొంటున్నాయి. అధికారంలో లేకపోతే దశాబ్దాల సాంప్రదాయ పార్టీలు కూడా ముక్కచెక్కలైపోతున్నాయి. కానీ ఎన్ని తక్కువ ఓట్లు వచ్చినా, లోక్‌సత్తా ఎందుకు అనే ప్రశ్న ఓటర్ల నుంచీ ఎప్పుడూ రాలేదు. లోక్‌సత్తా అవసరం ఈదేశానికి ఉందనే, కొంతకాలం తర్వాత మీకు మంచి భవిష్యత్తు ఉంటుందనే అందరూ చెబుతున్నారు ఎజెండాపై ఏరకమైన శాంపిల్ సర్వే చేసినా 90శాతానికి పైగానే మద్దతు తెలుపుతున్నారు. కానీ ఓట్లు వేయటం లేదు. లోక్‌సత్తాను రెండవ ఛాయిస్‌గా చూస్తూ సాంప్రదాయ పార్టీల మధ్యే అభ్యర్థులను ఎంచుకుంటున్నారు.

ఈ ఓటింగ్ స్పందన చూశాక.. ప్రజలకు మెరుగైన అభ్యర్థులను అందించేందుకు పార్టీలోనే అభ్యర్థుల మధ్య పోటీని నిర్వహించే ఓపెన్ ప్రైమరీలు వంటి పద్ధతుల్ని తాత్కాలికంగా వాయిదా వేసి సాధ్యమైనంతగా తేలిగ్గా కొత్త రాజకీయాన్ని ఆచరించేందుకు కూడా లోక్‌సత్తా ప్రయత్నించింది. కానీ డబ్బు, మద్యం లేకుండా ఎన్నికల్లో పోటీచేయటం, కులం, మతం, ప్రాంతం, భాష వంటి విభేదాలను రెచ్చగొట్టే విద్వేష రాజకీయాలకు దూరంగా ఉండటం, ఎజెండా వంటి మౌలిక విషయాల్లో రాజీపడలేదు. వీటిల్లో రాజీపడితే ఇక లోక్‌సత్తా అక్కర్లేదు. అంత ప్రయత్నించినా ఎన్నికల్లో ఆశించిన స్పందన రాలేదు.

అయితే మాత్రం ఎన్నికలలో పాల్గనమని ప్రకటిస్తారా? అని కొందరు శ్రేయోభిలాషులు ఆవేశంతో ప్రశ్నిస్తున్నారు. లోక్‌సత్తా సంస్థాగత లోపమే ఎన్నికల్లో వైఫల్యానికి కారణమని, అది సరిచేసుకోవాలని సలహాలిస్తున్నారు. వారి ఆవేశాన్ని అర్థం చేసుకోవచ్చుగానీ, సంస్థాగతంగా లోక్‌సత్తా అద్భుతంగా నిర్మాణమైనా ప్రజాక్షేత్రంలో ఇంకా పరిస్థితులు అనుకూలంగా లేనందున ఫలితాల్లో పెద్దమార్పు రావు. ఆడలేక మద్దెల ఓడు అనే ధోరణి లేకపోతే, బిగ్ పిక్చర్‌లో లోపాన్ని సరిచేసేంత పెద్ద అంశాలేవీ కావివి. రాజకీయ పార్టీ అన్నాక లోపాలున్నవారు, బాధాసర్పదష్టులు సహా ఎందరో వస్తుంటారు.

సమాజంలో ఉన్న సరకు అది. సమాజానికి అతీతంగా పార్టీని నిర్మిస్తే అది కూలిపోవటం ఖాయం. అందుకే, అడ్డమైనవాళ్లందరికీ అవకాశాలిచ్చారని వాపోవటం వంటివి చిన్నచిన్న అంశాలు. స్థూలంగా విధానాలకు లోబడి వాళ్లు పనిచేయాలి, క్షేత్రస్థాయిలో లక్ష్యానికి తగ్గ ఆదరణ ఉండాలి తప్ప మిగిలినవి పెద్ద అంశాలు కావు. దేశాన్ని, పార్టీని నాశనం చేస్తాం ఒక్క జేపీ మాత్రం అంతా సరిచేసి సమర్థవంతంగా నడిపించాలి అనడానికి ఈదేశం, లోక్‌సత్తా పార్టీ జేపీ ఒక్కడి సొత్తు కాదు కదా! పార్టీ సంస్థాగత వ్యవహారాల నుంచి వైదొలుగుతున్నట్టు, కేవలం విధానపరమైన అంశాలకు మాత్రమే పరిమితమవుతున్నట్టు 2010లోనే జేపీ ప్రకటించారు. జేపీ అసమర్థత, పట్టించుకోకపోవటం వల్ల కొందరు పార్టీని విడిచిపెట్టి వెళ్లారనటంలో కూడా పెద్ద పస లేదు. మాటవరసకు సాక్ష్యాధారాల్ని చూసినా, వాళ్లు బైటికెళ్లి సాధించిన పెద్ద ఘనవిజయాలేవీ లేవు, వాళ్లు చేరిన ఆయా పార్టీలకు వచ్చిన లాభమేమీ లేదు. లోక్‌సత్తా పార్టీలో చేరినవారిలో ఎన్ని లోపాలున్నా, వాళ్లంతా ఈదేశానికి ఏదో చేయాలనే తపనతో వచ్చినవారే కాబట్టి ఇప్పుడు రంధ్రాన్వేషణలు, ఎవరినో వేలెత్తిచూపటాలు అనవసరం. ఎటువంటి ప్రోత్సాహకాలు, అధికారం లేకపోయినా పనిచేస్తున్నారు వాళ్లు.

లోక్‌సత్తా ఇంకొంతకాలం అలాగే ఎన్నికలలో పాల్గంటూ వెళితే కొంతకాలానికి మార్పు వస్తుంది కదా అనేదే ఎక్కువమందిని తొలుస్తున్న భావం. ఇది విలువైన సందేహం, వాస్తవం కూడా. భవిష్యత్తు లోక్‌సత్తా రాజకీయానిదే. లోక్‌సత్తా ఎజెండాలో కలగలిసిన నిజమైన సామ్యవాద-ఉదారవాద భావాల కాంబినేషన్‌కే ముమ్ముందు ఆదరణ పెరుగుతుంది. ఈ రెండు భావజాలాలూ ఉన్న కొత్త రాజకీయం కాబట్టే లోక్‌సత్తా ఒకే సమయంలో బీజేపీ, కమ్యూనిస్టులతో కలిసి పనిచేయగలుగుతుంది. అయితే లోక్‌సత్తా ఎన్నికల్లో గెలిచేందుకు వెచ్చించే సమయంలోగా ఈదేశ ప్రయోజనాలు ఆగవు. మనం ఒక పార్టీగా సాధించే విజయాలకన్నా ఈదేశ ప్రయోజనాలు మనకు ఎక్కువ కాబట్టి ఎన్నికలకు కొంతకాలమైనా దూరంగా ఉండి ఈలోగా అన్ని పార్టీలు, సంఘాలతో కలిసిపనిచేస్తూ కొన్ని లక్ష్యాలను సాధించటం అవసరం.

ఇప్పుడు తక్షణ ఎజెండాగా దేశసమగ్రతకు, కేంద్రం బాధ్యతలకు విఘాతం లేకుండా అధికారాన్ని వికేంద్రీకరించి రాష్ట్రాలకు, స్థానిక ప్రభుత్వాలకు బదిలీ చేయాలి. విద్య, ఆరోగ్య రంగాలను ప్రక్షాళన చేసి అందరికీ అందుబాటులోకి తేవాలి. వీటి మీద లోక్‌సత్తా 2.0 దృష్టి సారించింది. ఈదేశంలో ఢిల్లీ నుంచి గల్లీ దాకా లోక్‌సత్తా స్పృశించని రంగమంటూ లేదు. భారతదేశంలో నివారించదగ్గ బాధలను తొలగించేందుకు, ప్రతి బిడ్డకూ ఎదిగే అవకాశాలను కల్పించేందుకు 41 ఏళ్లుగా జేపీ అలుపెరగని బహుముఖ కృషి చేస్తున్నారు. ఆ సంస్కరణల కోసం కృషిని అలాగే కొనసాగిస్తూనే విద్య, ఆరోగ్యం, రాష్ట్రాలకు, స్థానిక ప్రభుత్వాలకు అధికార వికేంద్రీకరణను తక్షణ ఎజెండాగా చేపడుతోంది. లోక్‌సత్తా ఎన్నికల బరిలో ఉంటే మిగతావాళ్లు కలిసివచ్చే వాతావరణం ఇప్పుడు లేదు. అన్ని పార్టీలలో సహృదయులు ఉన్నా వాళ్లు కూడా ఏమీ చేయలని నిస్సహాయ స్థితిలో ఉన్నారు. అందుకే ఈ నిర్ణయం. లోక్‌సత్తా భావజాలం నుంచి స్ఫూర్తి పొంది వచ్చిన ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)లాగా మాటవరసకి లోక్‌సత్తా కొత్త రాజకీయం చేయటం లేదు. లోక్‌సత్తాది మీకది-నాకిది అనే లావాదేవీల రాజకీయం కాదు, వివక్ష లేకుండా ఈదేశంలో ప్రతి బిడ్డకూ ఎదిగే అవకాశాలను కల్పించే 'సమూల పరివర్తన' రాజకీయం. తన ట్రాన్స్‌ఫర్మేషనల్ రాజకీయం దిశగా, ఆ పరిధిలో ట్రాన్సాక్షనల్ రాజకీయం చేసే అవకాశం లోక్‌సత్తాకు లభించటం లేదు. మీడియా రూపంలో కావచ్చు, మరోరూపంలో కావచ్చు.. సమాజంలో వనరులు, సామర్థ్యం ఉన్నవారు ఆ తోడ్పాటుని లోక్‌సత్తాకి ఇవ్వటం లేదు. అందుకే ఎన్నికలకు విరామం ప్రకటించింది. ఎన్నికలలో గెలవకపోతే ఇంట్లో కూర్చునే నేతలున్న ఈ రాజకీయ వ్యవస్థలో గెలుపోటములతో, పదవులతో సంబంధం లేకుండా సేవ చేసే రాజకీయాన్ని లోక్‌సత్తా ప్రారంభించింది. ఒక్క ఎంపీ కూడా లేకుండా ఈదేశంలో అనేక మౌలిక సంస్కరణల్ని సాధించింది. ఈదేశంలో రాజకీయాల పట్ల ద్వేషాన్ని తగ్గించి ప్రజల భాగస్వామ్యమున్న కొత్త రాజకీయ సంస్కృతి దిశగా అనేకమందిని మరల్చింది. లక్షలమందిని ఏదోకస్థాయిలో కొత్త రాజకీయ ఆలోచనల్ని రగిల్చింది. బహిరంగచర్చల భాషను, ప్రమాణాలను పెంచింది. ఈదేశ ప్రజాస్వామ్యం, రాజకీయం, పాలనా రంగాల గతిని విశేషంగా ప్రభావితం చేసింది.

ఈ నేపథ్యంలో.. ఎన్నికలకు విరామం ప్రకటించి అధికార వికేంద్రీకరణ, విద్య, ఆరోగ్యం తక్షణ కార్యాచరణగా లోక్‌సత్తా 2.0 సాహసోపేత నిర్ణయాన్ని అన్ని వర్గాల ప్రజలూ ఆశీర్వదిస్తారని, అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు ఈ లక్ష్యసాధనలో కలిసివస్తాయని ఆశిస్తున్నాం. ❐

# సరికొత్త పంథాలో లోక్‌సత్తా

- కూసంపూడి శ్రీనివాస్,
ఏపీ అధికార ప్రతినిధి, లోక్‌సత్తా పార్టీ

ప్రస్తుతం మనదేశంలో ఉన్న రాజకీయ పార్టీలన్నీ ఓట్లు, సీట్లే లక్ష్యంగా చేసుకుని డబ్బుతోనూ, విద్వేషాలతోనూ, మద్యంతోనూ, ఆచరణసాధ్యంకాని హామీలతోనూ ప్రజలను ప్రలోభాలకు గురిచేసి, అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలను గాలికొదిలేసి తమ స్వప్రయోజనాల కోసమే పాటుపడుతున్నాయన్నది వాస్తవం. అంతేకాకుండా ఈదేశంలోని రాజకీయాలన్నీ కుల, వారసత్వ రాజకీయాలేనన్నది వాస్తవం. అందులోనూ ఈ జాడ్యం ప్రాంతీయ పార్టీల్లో చాలా అధికం. మనదేశంలోని ఏ ప్రాంతీయ పార్టీ నాయకత్వాన్ని గమనించినా, తమ వారసులను భవిష్యత్తు నేతలుగా తీర్చిదిద్దడానికి, వారికే అధికార బాధ్యతలను అప్పచెప్పడానికి ఎప్పుడూ పావులు కదుపుతూ ఉంటారు. వారసత్వం లేనివారు తమ కుటుంబసభ్యులకు, సన్నిహిత వర్గానికి వగ్గాలు ఇవ్వాలనుకుంటారు అంతే. దేశమంటే నేను, నా వారసులు, నా అనుచరులే అనే నినాదాన్ని నేటి రాజకీయ నాయకులు బలంగా వినిపిస్తున్నారు. అంతేకాదు, సంపాదన కోసం ఈరోజుల్లో రాజకీయ నాయకులు రాజకీయాన్ని ఆర్థిక వనరుగా మార్చేశారు. అధికారంతో ఆస్తులను కూడబెట్టారు. అరచేతిలో అభివృద్ధి అనే స్వర్గం చూపెడుతున్నారు. నేటి రాజకీయాలన్నా, రాజకీయ నాయకులన్నా అసహ్యం కలిగించే స్థాయికి దిగజార్చారు. గుత్తేదారులు, సామ్రాజ్యవాదులు, పెట్టుబడిదారులు, మాఫియాలు, కాంట్రాక్టర్లు, పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు, ఇతరత్రా ఆర్థికంగా ఉన్నవారు ఎటువంటి ప్రజాసేవ నేపథ్యం, లక్ష్యం లేకుండానే నేటి రాజకీయాల్లో రంగప్రవేశం చేస్తున్నారు. సిద్ధాంతాలు గాలిలో కలిసిపోయాయి. ప్రస్తుత పరిస్థితుల్లో రాజకీయాల్లో ఓటుబ్యాంకు రాజకీయాలు, ఫిరాయింపు రాజకీయాలు, వర్గ రాజకీయాలే ముందుండి నడిపిస్తున్నాయి. అవినీతి, అధికారం రెండూ కూడా విడదీయలేని బంధంగా కలిసిపోయాయి. అయితే వీటన్నింటికీ అతీతంగా గత పది సంవత్సరాలుగా (ఉద్యమంగా ఇరవయ్యేళ్లుగా) కేవలం ప్రజాసమస్యల పరిష్కారానికి లోక్‌సత్తా పార్టీ చేస్తున్న కృషి అందరికీ తెలిసిందే. ఉద్యమ నేపథ్యం కలిగిన లోక్‌సత్తా పార్టీ గతంలోనే ఈదేశంలో ఎప్పుడూ చూడనిస్థాయి మౌలిక సంస్కరణలకు శ్రీకారం చుట్టిందన్న విషయంకూడా అందరికీ తెలిసిందే. ఇప్పుడు దేశంలో జరుగుతున్న మార్పులకు అనుగుణంగా, లోక్‌సత్తాకున్న వనరులను బేరీజు వేసుకుని కొన్ని బలమైన లక్ష్యాలను సాధించే క్రమంలో తాత్కాలికంగా ఎన్నికలకు దూరంగా ఉండాలని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు డా।। జయప్రకాష్ నారాయణ్ తీసుకున్న సంచలన నిర్ణయం ఈదేశంలో రాబోతున్న గొప్ప మార్పులకు శ్రీకారం కాబోతోంది. నీతి, నిజాయతీ, అద్భుత నైపుణ్యం ఉన్న పార్టీ కార్యకర్తలు తమ శక్తియుక్తులను ఎన్నికల పందేరానికి బలి చేసుకోకుండా, పార్టీలకు అతీతంగా ఈ దేశభవిష్యత్తుకి అవసరమైన కీలక అంశాలపై దృష్టి పెట్టాలని జేపీ భావించారు. ఫలితంగానే ఈ నిర్ణయం. ఉద్యమంగా, పార్టీగా ఇరవయ్యేళ్ల తమ భావజాలం అజరామరమే అయినా, ప్రస్తుత రాజకీయాలలో వచ్చిన మార్పులకు, ప్రజల ఆలోచనాతీరుకి అనుగుణంగా కొత్త విధానంతో, సవరించిన తక్షణ ఎజెండాతో పోరాడాలని లోక్‌సత్తా నిర్ణయం తీసుకుంది.

ఉద్యమ సంస్థగా, రాజకీయ పార్టీగా గత రెండు దశాబ్దాలలో ప్రజాస్వామ్య ఉద్యమాలకు, ఎన్నో మౌలిక మార్పులకు లోక్‌సత్తా నాంది పలికిందనటంలో సందేహం లేదు. రాజకీయాలంటే కుళ్లు, రాజకీయ నాయకులంటే ద్రోహులు అనే నిరాశనిస్పృహల మధ్య యువత ఉన్నన్నాళ్లూ ఈదేశ అభివృద్ధి సాధ్యం కాదని, ముందుగా ఆ నిరాశావాదం నుంచి యువత బైటపడాలని, అదేవిధంగా లోక్‌సత్తా ప్రతిపాదిస్తున్న కొత్త రాజకీయ సంస్కృతి ప్రాతిపదికనే ఈదేశంలో ప్రత్యామ్నాయం వస్తుందని, దాని ద్వారానే అవినీతిరహిత సమాజం ఏర్పడుతుందని లోక్‌సత్తా

ఆనాడే స్పష్టం చేసింది. అదే ధోరణిలో కొనసాగుతూ పార్టీల పట్ల పక్షపాత ధోరణి చూపకుండా, ఎన్నికైన ప్రజాప్రతినిధుల పట్ల నిరసన భావాల్ని ప్రదర్శించకుండా రాజ్యాంగ పద్ధతుల ద్వారా, సామరస్య పరిష్కారం కోసం విశేష కృషి చేయబట్టే ఈదేశ చరిత్రలో మరే ఉద్యమమూ సాధించనన్ని ఫలితాలను లోక్‌సత్తా సాధించింది. వాటిలో పెట్రోలు బంకుల్లో తూనికల మోసాన్ని చాలావరకు అరికట్టడం, ఓటర్ల జాబితా ప్రక్షాళన, అభ్యర్థుల నేరచరితను ప్రకటించే చట్టం, మంత్రివర్గ సభ్యుల సంఖ్యని కుదించే ఏర్పాటు, పాలనా సమాచార హక్కు చట్టం, జాతీయ ఆరోగ్య మిషన్, స్థానిక న్యాయాలయాల చట్టం, సహకార సంఘాల స్వయంప్రతిపత్తి, 2జీ స్పెక్ట్రం అక్రమ కేటాయింపుల రద్దు-ప్రకృతి వనరుల కేటాయింపులో వేలం పాట విధానం, లోక్‌పాల్‌చట్టం, ఎన్‌జేఏసీ వంటివి కొన్ని ఉదాహరణలు మాత్రమే.

మనదేశంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా, ఎక్కడ జరిగినా గెలిచేది రాజకీయ పార్టీలే. కానీ ఓడేది మాత్రం ఎప్పుడూ ప్రజలే అన్నది వాస్తవం. డబ్బు, మద్యం పంచడం మాత్రమే కాదు, అభద్రతా భావం నుండి వ్యక్తి ఆరాధన దాకా అనేక మానవ బలహీనతలను, పోకడలను ఎన్నికల ప్రయోజనాల కోసం నిస్సిగ్గుగా పార్టీలు వాడుకుంటున్నాయి. అలాగే మత భేదాలను విద్వేషాలుగా మార్చి కొన్ని కొన్ని పార్టీలు వాడుకొంటున్న వైనం ఎక్కువవటం మనందరికీ తెలిసిందే. ప్రజల చేత, ప్రజల కొరకు, ప్రజల వల్ల సాగే ప్రభుత్వం అనే ప్రజాస్వామ్య నిర్వచనాన్ని అందరూ ఉటంకిస్తుంటారు. ప్రజావ్యతిరేకంగా ఉంటూనే తమ మనుగడ సజావుగా సాగడానికి ప్రభుత్వాలు ఈ నిర్వచనాన్ని వాడుకుంటాయి. తాము ప్రజల చేత ఎన్నికయ్యామని, ప్రజల కొరకు పనిచేస్తున్నామని, ప్రజల వల్ల తమకు సాధికారత వస్తున్నదని ప్రభుత్వాలు చెప్పుకొంటాయి. ప్రజాభిమతం, ప్రజాభిమానం అనే బ్రహ్మపదార్థం కింద తమ దోపిడీని కొనసాగిస్తుంటాయి. ఈ దివాళాకోరుతనం ఈ దేశంలో రాజకీయ సహజ స్వభావమే అని ఊరుకుంటే ప్రయోజనం లేదనే లోక్‌సత్తా 'ప్రజలే ప్రభువులు, పాలకులు సేవకులే' నినాదంతో సంస్కరణోద్యమ భేరీని మోగించింది. కానీ రాజకీయాలంటే అసలు అర్థం ప్రజల సమస్యలకు సృజనాత్మకమైన, వినూత్నమైన పరిష్కారం కనుగొని ఆచరణలో పెట్టే పద్ధతుల సముదాయం. భారత రాజకీయాలు ఆ నిర్వచనానికి ఇంకా చాలా దూరంలో ఉండవచ్చు. అలా అని వాటిని అసహ్యించుకుని దూరంగా ఉన్నా అవి ప్రజలను కాటువేయక మానవు. అందువల్ల ఆ రాజకీయాల కుళ్లును అర్థం చేసుకుని దాన్ని ప్రజలకు విప్పి చెప్పి పరిష్కారాలను చూపి వాటిని ప్రజల భాగస్వామ్యంతో సాధించేందుకు వేదికగా పనిచేసే ప్రయత్నంలో లోక్‌సత్తా శక్తికి మించిన కృషే చేసింది. లోక్‌సత్తా ఉద్యమ ప్రస్థానంలో పదేళ్ల తర్వాత మౌలికమయిన రాజకీయ సంస్కరణల్ని సాధించడం కోసం ప్రధాన పార్టీల మీద రాజకీయ వత్తిడి కూడా అవసరమన్న ఆలోచన కాలక్రమేణా బలపడింది. అందుకే మార్పుని కోరే ప్రజల ఓటుని సంఘటితం చేసి మన రాజకీయ, పాలనా సంస్కరణలు వేగవంతం చేయడం కోసం ఓ వర్గంగా వ్యవహరించటం కోసమూ, ఒక నిజమైన నాగరిక ప్రజాస్వామ్యంలో పార్టీల తీరు, బహిరంగ చర్చ ప్రమాణాలు ఎలా ఉండాలో ఆచరణలో చూపెట్టాల్సిన అవసరముందన్న ఆలోచనతోనూ 2006 నుంచి రాజకీయ పార్టీ ప్రస్థానం ప్రారంభించింది. అయితే ఇప్పటి రాజకీయంలో ఉన్న ప్రత్యేక పరిస్థితుల కారణంగా.. పార్టీకి లభిస్తున్న ఓట్లు ఈ దేశంలో వేగంగా తీసుకురావాల్సిన మార్పులకు అనుగుణంగా లేవనే చెప్పాలి. ఈ నేపథ్యంలోనే లోక్‌సత్తా ఒక పార్టీగా బలోపేతం అయ్యేంతవరకు ఈ దేశంలో సమూల మార్పులు ఆలస్యం కాకూడదన్న భావనతో ఎన్నికలను కొంతకాలం పక్కనపెట్టాలని పార్టీ నిర్ణయం తీసుకుంది. అయితే లోక్‌సత్తా మార్కు రాజకీయాలకు పరిస్థితులు అనుకూలించేంత వరకు ఎన్నికలలో పాల్గనకపోయినా, రాజకీయ, పాలనా సంస్కరణల కోసం అలుపెరగని కృషిని కొనసాగిస్తూనే ఉంటుందనేది స్పష్టం. ఇదే సందర్భంలో కేంద్రం అధికారాలకి, దేశ సమగ్రతకి భంగం కలగకుండా రాష్ట్రాలకు పూర్తి స్వయంనిర్ణయాధికారం ఇవ్వడం, ఉత్తమ ప్రమాణాల విద్య-వైద్యం ప్రతి బిడ్డకూ, కుటుంబానికీ అందించే వ్యవస్థ ఏర్పరచడం, స్థానిక ప్రభుత్వాలకి, పౌరులకి పూర్తి బాధ్యతలు, పన్నుల్లో వాటాని అందించి సమస్యల పరిష్కారం అనే స్పష్టమైన లక్ష్యాలను లోక్‌సత్తా 2.0 కార్యాచరణగా చేపట్టి ప్రజల భాగస్వామ్యంతో భారతదేశ పరివర్తన కోసం కృషి చేయడానికి ప్రజల్లోకి వెళ్లడానికి మరో సరికొత్త పంథాని ఎంచుకుంది. రాజకీయాధికారం లక్ష్యాల సాధనకు ఒక మార్గమే తప్ప గమ్యం కాదు కాబట్టి లోక్‌సత్తా తీసుకున్న ఈ సాహసోపేత నిర్ణయంలో ప్రజలు కూడా భాగస్వాములైతే ఈదేశంలో సమూల మార్పులు తీసుకురావడం అసాధ్యమేమీ కాదు. ఆ దిశగా భావసారూప్యత గల అన్ని పార్టీలు, ప్రజాసంఘాలు, పౌరులు కలిసిరావాలని విజ్ఞప్తి చేస్తున్నాం. ❐

# లోక్‌సత్తా భావాలు అజరామరం!



ఎన్నికలలో గెలిస్తే గెలిచినట్టు కాదు...
ఎన్నికలలో ఓడితే ఓడినట్లు కాదు...
- లోక్‌సత్తా పార్టీ ప్రారంభసభలో జేపీ

లోక్‌సత్తా పార్టీ
ఆశయం సాధించకుండానే
అంతరించిపోతుందని ఒకరు,
దుకాణం మూసేసిందని ఒకరు,
ఆర్ఐపి అని మరొకరు..

ఇలా ఎవరికి తోచినట్లు వాళ్లు కామెంట్స్
చేస్తుంటే ఆవేదనతో ఈ పోస్ట్ చేస్తున్న..
లోక్‌సత్తా కంటే ఈ నోట్లు ఓట్ల రాజకీయాలే
మంచివి అని మీకు అనిపిస్తే.. అలాగే
కానివ్వండి

లోక్‌సత్తా పార్టీ నిజమైన కార్యకర్తగా గుండెపై
చేయివేసి ఒక విషయం మాత్రం చెప్పగలను
"మిగతా సంస్థలు, జాతీయ రాజకీయ పార్టీలు
సాధించలేని గొప్ప సంస్కరణలు లోక్‌సత్తా
సాధించింది.. భవిష్యత్తులో మరిన్ని విజయాలు
సాధిస్తుందనే నమ్మకం ఉంది"

మార్గం మారిన ఆశయం మారదు

- హరిప్రసాద్ వాడికారి

❐

# ఆయనతోపాటు మనమూ ఓడిపోయాము

- సిద్ధు మంచికంటి

లోక్‌సత్తా ఎలక్షన్‌లో పాల్గొనదు అని ప్రకటిస్తే ఎందరికో అది షాకింగ్‌గా తగిలింది. నిజానికి మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గంలో ఓడిపోయినా జేపీ ఈ నిర్ణయం తీసుకోలేదు. ఆయన ఎందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు అనేదాని కంటే రాజకీయ ఆటని ఎంతగా మార్చగలిగారు అనేది ఒకసారి చూద్దాం.



ఉద్యమ సంస్థగా, పార్టీగా రెండు పాత్రల్లో జేపీది ఒకటే ఆలోచన.. మంచి సంస్కరణలను తీసుకురావటం! అందులో ఆయన ఖచ్చితంగా ప్రభావం చూపించారు అని చెప్పాలి. లోక్‌సత్తా ఉద్యమం ఎన్నో సంస్కరణలని మనందరికీ సాధించిపెట్టిందని చాలామందికి తెలియదు. రైట్ టూ ఇన్ఫర్మేషన్ యాక్ట్ రావడంలో జయప్రకాష్ నారాయణ్ కృషి అపూర్వం. మిడిల్ క్లాస్ వారికి ఒక ఆశాదీపంగా నిలిచినా జేపీ 1.80శాతం ఓట్లని మాత్రం 2009 ఎన్నికల్లో పార్టీకి సాధించుకోగలిగారు. జేపీకి కనీసం ఒక 10శాతం ఓట్లు పడినా రాష్ట్ర, దేశ రాజకీయ పురోగతిలో ఖచ్చితంగా ఆయన పంథా, శైలి చొరబడేవి అని చెప్పొచ్చు. 2009లో కూకట్‌పల్లిలో గెలిచిన జేపీ అసెంబ్లీలో తనకంటూ సూపర్ బ్రాండ్‌ని ఏర్పరుచుకున్నారు. ఏ నాయకుడు మాట్లాడుతున్నా ఎదిరించి అరవడం, అడ్డుతగలడం చేసే అధికార, ప్రతిపక్షాలు ఆయన మాట్లాడుతుంటే పిన్ డ్రాప్ సైలెన్స్‌గా ఉంటూ ఆయన చెప్పిన లెక్కలకి మతులు పోగొట్టుకునేవి. అప్పర్ మిడిల్ క్లాస్ నుంచి కూడా జేపీకి మంచి సపోర్టు లభించింది. మరి కాస్త క్యాడర్ బలం పెంచుకుని ఉంటే లోక్‌సత్తా పార్టీ ఇంకా ఎక్కువ అభివృద్ధిని సాధించేంది అని చెప్పవచ్చు. జేపీ మంచి రాజకీయ నాయకుడు అని చెప్పేవాడు, లోక్‌సత్తా ఉత్తమ పార్టీ అనే ఆమె కనిపించారుగానీ ఓట్ల రూపంలో లోక్‌సత్తాకి సపోర్టు ఇచ్చిన పాపాన వాళ్లలో అత్యధికులు పోలేదు. మీడియాతో కలిసి రాజకీయ పార్టీలు లోక్‌సత్తాని ఎంతగా తొక్కగలవో అంతగా తొక్కాయి అనేది నిర్వివాదాంశం.

లోక్‌సత్తాకి సరైన క్యాడర్ లేకపోవడం అన్నింటా జేపీయే నడిపించడం ఒక పెద్ద మైనస్ పాయింట్ అని చెప్పాలి. నిజాయతీ విషయంలో తిరుగులేని జేపీ అచ్చం తనలాంటి వాళ్లని వెతకటంలో ఫెయిల్ అయ్యారు అనిపిస్తుంది. ముఖ్యంగా ఆయన చేసిన అతిపెద్ద తప్పు మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గానికి పోటీ చేయడం. బంగారంలాంటి కూకట్‌పల్లిలో తేలికగా గెలవగల ఛాన్స్‌ని పక్కనపెట్టేసి మల్కాజిగిరికి ఎంపీగా పోటీచేయడం ఆయన్ని, ఆయన పార్టీని, ఆయన్ని నమ్ముకున్నవారిని నట్టేటముంచింది. నిజానికి ఆయన ప్లాన్ వేరే ఏదైనా అయిఉండవచ్చుగాక, కానీ మల్కాజిగిరిలో పోటీ విషయంలో లెక్కతప్పింది. అప్పటివరకూ వచ్చిన ఫేం కోల్పోలేదుగానీ ఓ కుంగుబాటు.

జేపీ అంటే ఈరోజు ఆయన ఒక్కరే కాదు. ఆయన్ని నమ్ముకుని రాజకీయాలవైపు వచ్చిన యువత ఉంది, చదువరులు ఉన్నారు. ప్రొఫెషనల్స్ కూడా ఎందరో జేపీ తాజా నిర్ణయంతో అవాక్కయ్యారు. “లోక్‌సత్తా ఒక ఉద్యమ సంస్థ కాగా, అందులో రాజకీయాలు ఒక భాగం మాత్రమే..” అనేది జేపీ సమాధానం. కానీ జవాబు – ఆ పార్టీని చూసింది మాత్రం అనిన రాజకీయ పార్టీలకీ ప్రత్యామ్నాయంగానే. అలాంటి వారంతా ఇంకా ఆ షాక్‌లోంచే తేరుకుని ఉండరు.

ఏతావాతా.. తక్కువ ఓట్లు సంపాదించినా ఎక్కువ ప్రభావం చూపించిన పార్టీ లోక్‌సత్తా. ఆ పార్టీ ఓట్ల విషయంలో ప్రభావం చూపించలేకపోయిందిగానీ ఓటింగ్ శాతాన్ని ఖచ్చితంగా పెంచింది. సంస్కరణలూ, మిడిల్ క్లాస్, ఎబౌ మిడిల్ క్లాస్‌ని

తీవ్రంగా ప్రభావితం చేసినా ఓట్లు రాబట్టుకోలేకపోయింది. ఇప్పటికీ జేపీని జనాలు ఒక్క మాట కూడా అనలేకపోవడానికి ప్రధాన కారణం.. ఆయన ఓటమిలోగానీ, గెలుపులోగానీ ఎవరినీ దిగజారి విమర్శించలేదు. ఒక విమర్శ ఎంత సుస్పష్టంగా ఉండాలి అనేది ఆయన నుంచి అందరూ నేర్చుకోవాల్సిన పరిస్థితి. ఆయన పార్టీ గెలవలేదు, ఆయనకి చేతకాలేదు, ఎవ్వరినీ తప్పుపట్టకుండా ప్రజలని కూడా ఒక్క మాట అనుకుండా ఆయన మానాన ఆయన తప్పుకుంటున్నారు. అంతేగానీ గెలిచి కుట్రలు చేసి ఎమ్మెల్యేలని లాక్కోవడం లేదు, ఓడి ప్రతిపక్షంలో ఉండి కూడా ఎలాగైనా అధికారం కోసం ఎగబడటం లేదు, క్లారిటీ లేకుండా పొత్తులు పెట్టుకుని ప్రశ్నిస్తా అంటూ సరైన సమయంలో తప్పించుకోవడం లేదు. అతిపెద్ద పార్టీకి సొంతపార్టీని అమ్మేసుకుని మంత్రిగిరీ పొందలేదు. తిక్కరేగింది అని రైళ్లూ, బస్సులూ, పోలీస్ స్టేషన్లూ, పాలకేంద్రాలూ, ప్రభుత్వ ఆస్తులూ తగలబెట్టలేదు. ఎటిచ్చీ ఎన్నికల రాజకీయాల నుంచి తప్పుకుంటున్నారు అది కూడా ఒక్కటంటే ఒక్క మచ్చ కూడా లేకుండా.. అంతే. ఆయన నిస్సహాయత ఆయనది కాదు, మనది. సరైన నాయకుడు రంగంలోకి దిగితే బాగుండు అని ఎదురు చూసి తీరా వచ్చిన తరువాత సపోర్ట్ ఇవ్వకుండా దేశాన్ని స్కాముల, మతపిచ్చి ఉన్న రాజకీయ పార్టీల చేతుల్లో పెట్టి చేతులు కట్టుకుని చోద్యం చూసే మనది. కాబట్టి జేపీ ఓడిపోలేదు. నువ్వునేను అందరం కలిసి ఆయన్ని ఓడించాం.. ఆయన్ని ఓడించి మనమూ ఓడిపోయాం.

(ప్రజల పట్ల ఎంతో ప్రేమతో రాసిన ఈ వ్యాసం పూర్తి పాఠాన్ని లోక్‌సత్తా రాజకీయ ప్రక్షాళన 'ప్రజాఆయుధం' ఫేస్‌బుక్‌లో చూడవచ్చు) ❐


## జీవీఆర్ మహర్షికి పతంజలి స్ఫూర్తి అవార్డు

పతంజలి రచనలు మానవ జీవితంలోని భిన్న వైవిధ్యాలను చూపిస్తూ విలువలకు అద్దంపడతాయని రచయిత, కాలమిస్టు, సీనియర్ పాత్రికేయుడు జీఆర్ మహర్షి అన్నారు. కేఎన్‌వై పతంజలి సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో విజయనగరంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పతంజలి స్ఫూర్తి అవార్డును అందుకున్నారు. సమాజంలో మంచిని పెంచేలా రచనలు చేయాలని ముఖ్యఅతిథిగా హాజరైన జడ్పీ సీఈవో జి. రాజకుమారి అన్నారు. లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పతంజలి సాంస్కృతిక వేదిక జిల్లా అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రసాద్ వర్మ, ఎస్‌కే బాబు, పతంజలి సతీమణి ప్రమీల, గ్రంథాలయ సంస్థ పూర్వ ఛైర్మన్ రొంగలి పోతన్న, నాలుగు ఎస్సల రాజు, చీకటి దివాకర్, ఎంవీఎన్ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబుకు 0, కేసీఆర్‌కు 0.01

తర్కం, సాక్ష్యాలు, గణాంకాల ఆధారంగా నిర్ణయాలు తీసుకోకుండా కేంద్రీకృత ధోరణితో సొంత వర్గం పాలన చేసుకుంటున్న అదేరీతిలో గుడ్డిగా రూపొందించిన విద్యాహక్కు చట్టం (ఆర్‌టీఈ) అమలులో ఇంకా అధ్వాన్నంగా ఉందని గణాంకాలు తెలియచేస్తున్నాయి. ఈ కోటా కింద గత విద్యాసంవత్సరంలో 22.9 లక్షల సీట్లు ఉండగా, దాదాపు 3.46 లక్షల సీట్లే భర్తీ అయ్యాయి. ఇందులో ఆంధ్రప్రదేశ్ సున్నా (0) శాతంతో, తెలంగాణ 0.01శాతంతో అట్టడుగున ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల కంటే మిజోరాం (0.21శాతం), ఒడిషా (0.97శాతం) కాస్త మెరుగ్గా ఉన్నాయి. విద్యాహక్కు చట్టం కింద ప్రయివేటు పాఠశాలల్లో నాలుగోవంతు సీట్లను పేద, వెనకబడిన వర్గాల పిల్లలతో భర్తీ చేయాలి. కానీ చాలా రాష్ట్రాలు ఈ చట్టం అమలును నిర్లక్ష్యం చేశాయి. ఈ చట్టం లొసుగులను సవరిస్తే తప్ప మేం ఏమీ చేయలేం, సవరణకు ప్రయత్నిస్తున్నాం అని తప్పించుకుంటున్నాయి. కేంద్రంలో, తెలుగు రాష్ట్రాల్లో కొత్త ప్రభుత్వాలు ఏర్పడి మూడో సంవత్సరం వచ్చేస్తోంది. ఇప్పటికీ విద్యాహక్కు చట్టంలోని లోపాల్ని సరిచేసి ప్రమాణాలున్న చదువును అందించే ప్రయత్నమే లేదు. ఏటా రెండు కోట్ల మందిదాకా పిల్లల్ని మానవ వనరులుగా తీర్చిదిద్దే వ్యవస్థపై ఇంత నేరనవమాన నిర్లక్ష్యంతో వ్యవహరిస్తూ బెస్ట్ ముఖ్యమంత్రులమంటూ అవార్డులందుకుంటూ, జబ్బలు చరుచుకుంటూ మీడియాలో బాకాలు ఊదుకుంటున్నారు. ఢిల్లీ, రాజస్థాన్, తమిళనాడు వంటి కొన్నిచోట్ల ఈ చట్టం ద్వారా ప్రయివేటు స్కూళ్లలో సీట్లు మెరుగ్గా భర్తీ అవుతున్నా ప్రమాణాల్లో పెద్ద తేడా రావటం లేదు. ఉన్నకొద్దీ ప్రభుత్వ పాఠశాలల పట్ల ప్రజల్లో విముఖత పెరుగుతోంది. అందుకే రాష్ట్రాలకు విద్య, ఆరోగ్యం తదితర మౌలికాంశాల్లో మరింత స్వేచ్ఛనిచ్చి ఏమాత్రం జాప్యం లేకుండా మంచి ప్రమాణాలతో అందించేందుకు తగిన సంస్కరణల కోసం లోక్‌సత్తా పార్టీలకతీతంగా తాజా కృషిని ప్రారంభించింది. ❐

# ఇప్పుడు బాధ్యత పెరిగింది



లోక్‌సత్తా ఎలక్షన్లలో పోటీ నుండి
తప్పుకుందంటగా... హహహ...
నేనెప్పుడో చెప్పా.. ఇలాంటివి
ఇక్కడ బతకలేవు!!

.. నాతో కొందరన్న మాటలివి. కోపం రాలేదు
నాకు. బాధగా అనిపించింది. మన కోసం పుట్టి,
పోరాడుతున్న
పార్టీ ఎన్నికలలో పోటీ చేయటంలేదని తెలిసి,
హహహ అని నవ్వుతున్నారా?!

ఇదే నిర్ణయం మరేదైనా పార్టీ తీసుకుంటే,
పోటీ చేసే అవకాశం లేని పార్టీలో
మనమెందుకు,
పదవులు వచ్చే అవకాశం లేని చోట్ల ఉండటంలో
అర్థం లేదని పార్టీని వదిలివెళ్లిపోయేవారు.

కానీ,
లోక్‌సత్తా ఉన్నది అధికారం కోసమో, పదవుల
కోసమో, వాటి ద్వారా వచ్చే అక్రమ ఆదాయం
కోసమో
కాదు. అందుకే లోక్‌సత్తా కార్యకర్తలు, అభిమానులు,
మద్దతుదారులు గుండెలు బాదేసుకోవట్లేదు

ఇప్పుడు బాధ్యత పెరిగింది. తిరిగి పోరాడాలి.
ప్రజల తరపునే. అరే, లోక్‌సత్తాకు మన
అవసరం లేదు, మనకే లోక్‌సత్తా అవసరం ఉంది
అని సామాన్యురాలు గుర్తించేలా!!! మంచి చేసే
ప్రక్రియలో అడ్డంకులు వస్తూనే ఉంటాయి.
అధిగమించాలి.
జేపీగారితో ఆ దిశగా అడుగులు వేయాలి..

- వంశీ చాగంటి

# కరవును దేశప్రజల దృష్టికి తెచ్చిన లోక్‌సత్తా



మహారాష్ట్ర కరవును లోక్‌సత్తా దేశప్రజలందరి దృష్టికి తెచ్చింది. కరవుపై అరకొరగా వ్యవహరిస్తున్న మిగతా రాష్ట్రాలను మేలుకొలిపింది. ఓ పక్క అత్యధిక సంఖ్యాక ప్రజలు, ముఖ్యంగా రైతులు కరవుతో అల్లాడుతుంటే ఐపీఎల్ మ్యాచ్‌ల కోసం భారీగా నీటిని వినియోగించటమేమిటని ప్రశ్నిస్తూ లోక్‌సత్తా దాఖలు చేసిన 'పిల్' (ప్రజాహిత వ్యాజ్యం)పై బొంబాయి హైకోర్టు ఏకీభవించింది. "ప్రజలు ముఖ్యమా.. ఐపీఎల్ మ్యాచ్‌లు ముఖ్యమా?" అని ప్రశ్నించింది. రాష్ట్రాన్ని కరవు పీడిస్తున్నా బీసీసీఐ, ముంబయి, మహారాష్ట్ర క్రికెట్ సంఘాలు మ్యాచ్‌లు నిర్వహించ తలపెట్టటాన్ని హైకోర్టు తప్పుపట్టింది. "బీసీసీఐకి నీటి సరఫరాను నిలిపివేస్తేగానీ మీకు బాధ అర్థం కాదు" అని అభిప్రాయపడింది. "ఇంత నిర్లక్ష్యంగా ఎలా ఉండగలుగుతారు? ఇలా నీటిని వృథా చేయటం పెద్ద నేరం. మహారాష్ట్రలో పరిస్థితి ఎలా ఉందో మీకు తెలుసు" అని రాష్ట్ర ప్రభుత్వంపై జస్టిస్ వీఎం కనాడే, ఎంఎస్ కార్నిక్‌లతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఐపీఎల్‌కు సమయం తక్కువగా ఉన్నందున కోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకున్నా, కరవు రాష్ట్రంలో ఐపీఎల్ నిర్వహణను మాత్రం తీవ్రంగా తప్పుపట్టింది. మహారాష్ట్రలో పరిస్థితిని దేశమంతా ఆలోచించేలా చేసింది. ప్రజాసమస్యలపై పోరాటంలో కోర్టుల పాత్ర పరిమితంగానే ఉండాల్సి ఉన్నా, సమస్య తీవ్రత దృష్ట్యా, తక్షణం ప్రభుత్వాన్ని కదలించాల్సిన దృష్ట్యా లోక్‌సత్తా కోర్టును ఆశ్రయించింది. కోర్టు వ్యాఖ్యల పట్ల 'పిల్' దాఖలులో కీలకపాత్ర పోషించిన లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు సురేంద్ర శ్రీవాస్తవ హర్షం వ్యక్తం చేశారు. ❐

# నీటిని పొదుపు సామాజిక బాధ్యత: సునీల్ గావస్కర్



ఐపీఎల్ మొదలైననాటి నుంచి ఏదో ఒక వివాదం ఉంటూనే ఉందని, అయితే అవి ఇప్పుడున్న కరవులాగా జీవన్మరణ సమస్యలు కావని క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ అభిప్రాయ పడ్డారు. లోక్‌సత్తా పిటిషన్, కోర్టు వ్యాఖ్యలపై ఆయన తన కాలమ్‌లో స్పందించారు. మైదానం, పిచ్ సన్నద్ధతలపై నేనేమీ నిపుణుడను కాను. అందుకు ఎంత నీరు అవసరమవుతుందో, మ్యాచ్‌లు లేకుంటే ఎంత ఆదా అవుతుందో నాకు తెలియదు. ఏదేమైనా రైతుల జీవితాలు ఫణంగా ఉన్నప్పుడు ఒక్క ప్రాణం కూడా పోకుండా ఉండేందుకు చేయాల్సిందంతా చేయాలి. కరవు పీడిత ప్రాంతాల నుంచి ఐపీఎల్ మ్యాచ్‌లను తరలించటమొక్కటే విషయం కారాదు. మన దైనందిన అవసరాల కోసం నీటిని పొదుపుగా వాడటం ద్వారా సామాజిక బాధ్యతను ప్రదర్శించాలి. ఖచ్చితంగా మోదీ ప్రభుత్వాన్ని ప్రశంసించవలసిందే. కానీ ఈ ప్రశంస మోదీ సర్కారుకు మాత్రమేనా దక్కాల్సింది? విలువైన, పరిమితమైన దేశ సహజ వనరుల్ని ఇష్టమొచ్చినట్టు కాకుండా వేలం పద్ధతి ద్వారా, పారదర్శకంగానే కేటాయించాలని గాలి జనార్థన రెడ్డి కేసు దగ్గర్నుంచి పోరాడుతున్న లోక్‌సత్తా 2జీ స్పెక్ట్రం అక్రమ లైసెన్సులపై చేసిన న్యాయపోరాటం వల్లే వేలం పద్ధతి మొదలైంది. ❐



## ఉత్తరాఖండ్ పరిణామాలు ప్రేక్షకపాత్ర వహించాల్సినవి కావు, ముఖ్యమంత్రుల్ని ప్రత్యక్షంగా ఎన్నుకోవాలి, రాష్ట్రాలకు స్వేచ్ఛనివ్వాలి: జేపీ

విలువలకి, ప్రజాప్రయోజనాలకి అధికారం ఎంతో దూరమైందనటానికి ఉత్తరాఖండ్ పరిణామాలే తాజా రుజువని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ఎమ్మెల్యేలు పార్టీలు మారటం నుంచి రాష్ట్రపతి పాలన వరకూ ఉత్తరాఖండ్‌లో జరుగుతున్న పరిణామాలు ప్రేక్షకపాత్ర వహించాల్సినవి కావని, ముఖ్యమంత్రుల్ని (రాష్ట్రాల సారథుల్ని) అసెంబ్లీ ద్వారా కాకుండా ప్రజలే ప్రత్యక్షంగా ఎన్నుకునే విధానాన్ని తీసుకురావటమే రాష్ట్రాల్లో ఈ దిగజారుడు రాజకీయానికి విరుగుడన్నారు. “నిజమైన పరిపాలన, రాజకీయాలు ఇప్పుడు రాష్ట్రాల చుట్టూనే తిరుగుతున్నాయి. ప్రజలు రాష్ట్రప్రభుత్వాలను దృష్టిలో పెట్టుకునే ఓట్లు వేస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రాలకు పాలనలో స్వేచ్ఛనివ్వటంతోపాటు ఎమ్మెల్యేల కొనుగోళ్లు, అవినీతి రాజకీయం జరగకుండా అడ్డుకట్ట వేసేందుకు ముఖ్యమంత్రిని, అసెంబ్లీని వేర్వేరుగా ఎన్నుకోవటం అవసరం. ముఖ్యమంత్రి పదవికి కూడా ప్రత్యక్ష ఎన్నిక జరగాలి. దీనివల్ల అవినీతి, కొనుగోళ్ల రాజకీయాలకు కళ్లెం పడి పరిపాలన మెరుగవుతుంది” అని జేపీ అన్నారు. భిన్నత్వం, సంక్లిష్టతలు, సువిశాలత దృష్ట్యా జాతీయ స్థాయిలో పార్లమెంటు సభ్యులు ఎన్నుకునే ప్రభుత్వ విధానమే మనకి సరైనదని, కానీ రాష్ట్రాధినేతను మాత్రం ఎమ్మెల్యేల మీద ఆధారపడాల్సిన అవసరం లేకుండా ప్రత్యక్షంగా ఎన్నుకోవటం అవసరమని జేపీ స్పష్టంచేశారు. మన ప్రజాస్వామ్య వ్యవస్థపై ఎంతో ప్రభావం చూపిన బ్రిటన్‌లో వివిధ స్థాయిలో వివిధ రకాల ఎన్నికల వ్యవస్థలున్నాయని గుర్తుచేశారు. బ్రిటన్‌లో జాతీయ స్థాయిలో ఇప్పుడు మనం అనుసరిస్తున్న వెస్ట్‌మినిస్టర్ పద్ధతి ఉందని, రాష్ట్రాల్లోను, యూరోపియన్ పార్లమెంటు ఎన్నికలలోను దామాషా పద్ధతి ఎన్నికలు జరుగుతున్నాయని అన్నారు. అలాగే లండన్ నగర మేయర్‌ని ప్రజలు ప్రత్యక్షంగా ఎన్నుకుంటున్నారన్నారు. ప్రపంచమంతటా ఎన్నో నమూనాలు, ఉదాహరణలు కనిపిస్తున్నా దేశ పరిస్థితులకనుగుణంగా మెరుగైన పాలనను అందించేందుకు కావలసిన నమూనాల్ని అనుసరించటంలో మనం ఇప్పటికే ఆలస్యం చేశామని జేపీ అన్నారు. పరిష్కారాలను చర్చించి మెరుగైన పద్ధతుల్ని అమలు చేయకుండా ఒకరి మీద ఒకరు దుమ్మెత్తిపోసుకోవటం వల్ల నష్టపోతూనే ఉంటామన్నారు. “పార్లమెంటు నుంచి పంచాయితీ వరకు ప్రజలిస్తున్న ఎన్నికల తీర్పులు ప్రధానంగా రాష్ట్ర ప్రభుత్వాల మీదే కాబట్టి జాతీయ సమగ్రత పరిధిలో రాష్ట్రాలు సొంత విధానాల్ని అనుసరించే స్వేచ్ఛను ఇవ్వాల్సిన సమయం ఆసన్నమైందని” జయప్రకాష్ నారాయణ్ విజ్ఞప్తి చేశారు. ❒

## తాజా అసెంబ్లీ ఎన్నికల్లో రూ.60వేల కోట్ల ధనప్రవాహం, ఏదో జరుగుతోంది: రాజన్

తమిళనాడు, కేరళ, అసోం, బెంగాల్, పుదుచ్చేరిలో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రూ. 60,000కోట్ల డబ్బు ప్రవహిస్తోందని రిజర్వుబ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ రఘురాం రాజన్ అన్నారు. ఇది అసాధారణమని, దీనిపై లోతుగా దృష్టిసారించాల్సి ఉందన్నారు. “ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాల్లోనే కాకుండా పొరుగు రాష్ట్రాల్లోనూ ధనప్రవాహం హడావుడి కనిపిస్తోంది. ఏదో జరుగుతోంది. సక్రమంగా అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది” అన్నారు. ఎన్నికలు జరిగే ప్రతి సందర్భంలోనూ డబ్బు ప్రవాహం ఇబ్బడిముబ్బడిగా పెరగటాన్ని మామూలుగా చూస్తున్నామని వ్యాఖ్యానించారు. ఎన్నికల కమిషన్ నిఘాబృందాలు ప్రతి ఎన్నికల సమయంలో లెక్కచూపని నగదును పట్టుకుంటుండటం సర్వసాధారణమైపోయిందన్నారు. కాగా, ఎన్నికల కోడ్ ఆఫ్ కాండక్ట్ రాకముందే డబ్బు పంపిణీకి ఏర్పాట్లు పూర్తయ్యాయని కొందరు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇన్నివేల కోట్ల అక్రమ డబ్బు పంపిణీ జరుగుతుంటే ఏప్రిల్ 3 వరకూ పశ్చిమ బెంగాల్, అసోం, పాండిచ్చేరి, కేరళ, తమిళనాడులో పోలీసులు వరసగా రూ. 3.34కోట్లు, 9.12కోట్లు, 46.88లక్షలు, 8.75 కోట్లు, 20.40కోట్లు మాత్రమే పట్టుకున్నారని ఎన్నికల సంఘం లెక్కలు చెబుతున్నాయి. ❒

# అమెరికాలో ప్రజల ఆరోగ్య సంరక్షణ

**- అన్నపూర్ణ** (కాలిఫోర్నియా)

*మనదేశంలో జరిగే ఎన్నికలలో ప్రజల జీవితాలను బాగు చేసే విద్య, ఆరోగ్యం, స్థానికంగా వార్డులో, పంచాయతీలో రోజువారీ పనుల నిర్వహణలో మెరుగైన పద్ధతులు వంటి అంశాల గురించే చర్చ ఉండదు. మనం ఓటు వేస్తున్నాము, మన ఓటుతో గెలిచేవ్యక్తి మనకు కావలసిన పనుల్ని ఎంతమేరకు సమర్థంగా నెరవేరుస్తూ ఐదేళ్ల పాటు సేవలందించగలడు అనే ఆలోచనలేకుండా.. పోటీచేసేవాళ్లు మహారాజులు, వాళ్ల కొడుకులు, కూతుళ్లు, వాళ్ల పార్టీ ఎంతో గొప్ప అనే ఆత్మన్యూనతా భావంతో ఓటు వేస్తుంటాం. మన సొమ్మునే దోచుకుంటూ వాళ్లు విదిలించే తాయిలాల కోసం ఎగబడుతున్నాం తప్ప ఓటుతో విద్య, ఆరోగ్యం వంటి మౌలికమైన లక్ష్యాలను సాధించుకునే ప్రయత్నం చేయటం లేదు. డొనాల్డ్ ట్రంప్ వంటి కొన్ని వైపరీత్యాలున్నా అమెరికా ఎన్నికలలో మనిషి జీవితాన్ని బాగుచేసే విద్య, ఆరోగ్యం, స్థానిక పాలన వంటివాటిపై ఎంతో లోతైన చర్చ జరుగుతుంది. మనం ఎన్నికలలో ఓటు వృథా చేసుకున్నాక కూడా ఆరోగ్య సమస్య వస్తే కన్నీరు కారుస్తూ ఆసుపత్రులకు వెళ్లి అప్పులు చేసి మరీ బిల్లులు చెల్లించి నలిగిపోతుంటాం, ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవం వంటి వాటిని కూడా మొక్కుబడిగా జరుపుకుంటాం తప్ప ప్రభుత్వం అందించాల్సిన వైద్యం ఖర్చు మనకు ఎందుకు భారంగా మారుతోంది అనే ఆలోచన చేయం. విద్య, ఆరోగ్యం వంటివి అందించాల్సిన ప్రభుత్వం అవి చేయకుండా, క్రికెట్ మ్యాచ్‌లను నిర్వహించటం, పండగలకు కానుకలివ్వటం, గుళ్లుగోపురాలకు డిజైన్లు తయారుచేయటం, విరాళాలివ్వటం వంటి పనులు చేస్తున్నా మనం ప్రశ్నించం. మన ఓటు విలువ తెలుసుకోకపోవటం వల్ల ప్రభుత్వాలు, సాంప్రదాయ రాజకీయ పార్టీలు ఈ అంశాల్ని గురించి మాట్లాడకుండా ఎన్నికల్లో తప్పించుకుంటున్నాయి. విద్య, ఆరోగ్యం ఇస్తే జనం ఎక్కడ తమను లెక్కచేయరేమోనన్న భయం కూడా వారిని వెంటాడుతుంటుంది.*

*కానీ ప్రజల జీవితాల్ని బాగుచేసే చట్టబద్ధ పాలన, మౌలిక సదుపాయాలు, విద్య, ఆరోగ్యం, స్థానిక సాధికారత వంటి సమస్యలపై ప్రజలతో సంభాషణ ఎప్పుడైతే ఎన్నికలలో, రోజువారీ రాజకీయాలలో లేకుండా పోతుందో అది ఉన్నకొద్దీ జనజీవితానికి ప్రమాదకరంగా మారుతుంది. పరిమిత ఇన్సూరెన్స్‌లు, ఆరోగ్యశ్రీ వంటి చిట్కాలు ముదురుతున్న ఆరోగ్య సంక్షోభాన్ని పరిష్కరించలేవు. ప్రపంచ దేశాల అనుభవాలన్నిటినీ అధ్యయనం చేసి భారతదేశ పరిస్థితులకనుగుణంగా జేబులో నుంచి పైసా ఖర్చు లేకుండా అందరికీ ఆరోగ్యం అందించేందుకు లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ సుదీర్ఘకాలంగా కృషి చేస్తున్నారు. ఆయన ప్రయత్నం వల్లే యూపీయే ప్రభుత్వ హయాంలో జాతీయ ఆరోగ్య మిషన్ వచ్చింది. అయితే ఆ ప్రభుత్వ అసంపూర్ణ సహకారం వల్ల తొలుత జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్‌గా అమలై ఇప్పుడిప్పుడే అర్బన్ మిషన్‌గా సేవలందిస్తోంది. ఇది సరిపోదని ఆనాటి నుంచి ప్రయత్నిస్తున్న జేపీ, ఇప్పుడు దేశవ్యాప్తంగా వైద్యప్రముఖులను కలుపుకుని ప్రభుత్వ-ప్రయివేటు భాగస్వామ్యంతో సొంత ఖర్చు లేకుండా అందరికీ ఆరోగ్యం అందించేందుకు గట్టి ప్రయత్నం చేస్తున్నారు. ఈ సందర్భంగా అమెరికాలో ప్రజల ఆరోగ్య సంరక్షణ పద్ధతుల గురించి కొంత వివరించే ప్రయత్నం ఈ వ్యాసం..*

అమెరికాలో ప్రజల ఆరోగ్య సంరక్షణ విభిన్న నిర్వాహక సంస్థల ద్వారా జరుగుతుంటుంది. ఆరోగ్య పథకాలకు సంబంధించిన అంశాలు చాలావరకూ ప్రయివేటు రంగంలోని వ్యాపారుల నిర్వహణలోనే ఉన్నాయి. అమెరికాలోని కమ్యూనిటీ ఆసుపత్రుల్లో 58శాతం లాభాపేక్ష లేనివి. 21శాతం ప్రభుత్వం నిర్వహిస్తున్నవి. ఇంకో 21 శాతం లాభాపేక్షతోనే పనిచేసేవిగా ఉన్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) నివేదికను పరిశీలించినట్టయితే.. అమెరికాలో సగటున ప్రతీ మనిషికి 8608 డాలర్లను ప్రభుత్వం ఖర్చు చేస్తోందని, 2011లో మిగతా దేశాలన్నిటికన్నా జీడీపీలో అత్యధికశాతం (17.2) ఆరోగ్యసంరక్షణకే కేటాయించారని తెలుస్తుంది. బాలల ఆరోగ్య బీమా పథకం, వయోజనుల ఆరోగ్య పథకాల నిర్వహణ వంటి కార్యక్రమాల నుంచి 60-65శాతం నిధుల వ్యయం సమకూరుతుంది. 67 సంవత్సరాల లోపు జనాభాలో కొంతమంది వారికి లేదా వారి కుటుంబసభ్యుడు పనిచేసే సంస్థ/కంపెనీ/యజమాని ద్వారా ఆరోగ్య బీమా పొందడం,




మరికొందరు ఎవరికివారు డబ్బు చెల్లించి బీమా పాలసీలు తీసుకోవడం, మిగతావారికి అసలు బీమాయే లేకపోవడం మనం గమనించవచ్చు. ప్రభుత్వ సంస్థలో పనిచేసే ఉద్యోగులకు ప్రభుత్వమే నేరుగా ఆరోగ్య బీమా అందిస్తుంది.

అమెరికాలో మనిషి సగటు జీవన ప్రమాణం ప్రస్తుతానికి 78.4 సంవత్సరాలు. ఇది 1990లో 75.2 మాత్రమే. ఈ విషయంలో 221 దేశాల్లో అమెరికా 50వ ర్యాంకులో ఉంది. ఓఈసీడీ (ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కో ఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్) సర్వేలో పారిశ్రామిక సూచీలో 27వ స్థానంలో ఉంది. 1990లో ఇవరయ్యో స్థానం నుంచి ఇప్పుడు ఏడు స్థానాలు దిగువన నిలిచింది. 2013లో జాతీయ ఆరోగ్య సంస్థ ఎక్కువ ఆదాయంగల 17దేశాల మధ్య నిర్వహించిన పరిశోధన వల్ల తెలిసిందేమంటే, అమెరికాలోనే ఎక్కువ సంఖ్యలో స్థూలకాయులు ఉన్నారు, కారు ప్రమాదాలు, శిశుమరణాలు, గుండె, శ్వాసకోశ వ్యాధులు, లైంగిక అంటువ్యాధులు ఎక్కువగా ఉన్నాయి, టీనేజ్ కూడా రాకుండానే బాలికల గర్భధారణ, గాయాలబారిన పడినవారు, హత్యారోపణ కేసుల్లో నేరస్తులు పెద్దసంఖ్యలో ఉన్నారు. మిగిలిన అగ్రరాజ్యాలతో పోలిస్తే అమెరికాలోని పురుషులు 4 సంవత్సరాలు తక్కువగా జీవిస్తున్నట్టు తేలింది. అయినప్పటికీ అభివృద్ధి చెందిన దేశాల జనాభా కంటే 75 సంవత్సరాలు పైబడి జీవించేవారి సంఖ్య అమెరికాలోనే ఎక్కువగా ఉండటం విశేషం. అభివృద్ధి చెందిన మిగతా దేశాల్లోని ప్రజల కంటే అమెరికాలోని ప్రజలు ఎక్కువమంది క్యాన్సర్ ఎంఆర్‌టి సీటీ స్కాన్ వంటి పరీక్షలు చేయించుకోవటం చూస్తుంటాం. మిగిలిన అభివృద్ధి చెందిన దేశాల్లో కంటే ఎక్కువ మోతాదులో కొలెస్ట్రాల్, రక్తపోటు ఉన్నవారి విషయంలో సత్వర నివారణా చర్యలు తీసుకుంటున్నారు. ఫార్మసీలలో లభించే మందులు ఎక్కువగా అందుబాటులో ఉండటం వలన ఎలాంటి భయాందోళనలూ లేకుండా అదుపులో ఉంచుకో గలుగుతున్నారు. కెనడా, ఇంగ్లండ్, స్కాట్లాండ్ దేశాలలో కంటే ఈదేశంలో చక్కెర వ్యాధి బాధితులు తగిన ట్రీట్‌మెంట్ తీసుకుంటూ ఆరోగ్యాన్ని పరిరక్షించుకుంటుంటారు. నాలుగురకాల కేన్సర్ జబ్బులకు సంబంధించి 31 దేశాల్లో ఈ వ్యాధి నుంచి కోలుకున్నవారిలో అమెరికా వారు అత్యధికంగా ఉన్నారు. ఆ తర్వాత జపాన్, ఫ్రాన్స్ వారు ఉన్నారు. 2015 సంవత్సరం మొదటి మూడు

నెలల్లో అమెరికాలోని యువతకు 11.9శాతం మందికి ఆరోగ్య బీమానే లేదని గ్యాలప్ అనే సంస్థ తన నివేదికలో తెలిపింది.

అందుబాటులో ఆరోగ్య సేవల చట్టం (ఎఫర్డబుల్ కేర్ యాక్ట్) అందుబాటులోకి వచ్చాక ఈ బీమా లేనివారి సంఖ్య క్రమంగా తగ్గింది. 2004లో ఒక వైద్యసంస్థ (ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడిసిన్) నివేదికను గమనిస్తే, తమ దేశంలోని పౌరులకు ఆరోగ్య రక్షణ గ్యారంటీ ఇవ్వని కొన్ని పారిశ్రామిక దేశాల్లో అమెరికా కూడా ఉండటం దిగ్భ్రాంతిని కలిగిస్తుంది. 20014 ఓఈసీడీ నివేదికను పరిశీలిస్తే, ఒక్క మెక్సికో, టర్కీ, అమెరికా దేశాలు తప్ప మిగతా అన్ని ఓఈసీడీ దేశాల్లోనూ 1990 నాటికి కనీసం 98.4శాతం జనాభాకి పూర్తి బీమా సౌకర్యం (అన్ని వ్యాధులకూ వర్తించే) కలగచేయటం విశేషం. ఇటీవల జరిపిన సర్వేలో ఆరోగ్య బీమా లేని కారణంగా 45,000 నుంచి 48,000 మంది ప్రజలు అమెరికాలో మృత్యువాత పడ్డారని వార్తలు తెలుపుతున్నాయి. (2007 సంవత్సరంలో తమ సొంత ఆస్తులకు సంబంధించి దివాళా ప్రకటించినవారిలో 62.1శాతం మంది తమ వైద్యానికయ్యే ఖర్చు కోసం దరఖాస్తు చేసుకున్నారు. వైద్యఖర్చులు భరించలేక వయోవృద్ధుల్లో 25శాతం మంది తమ ఆస్తుల మీద దివాళా ప్రకటించినట్టు 2013లో జరిపిన సర్వేలో వెల్లడైంది. ఇంకా 43శాతం మంది తమ నివాస గృహాలను తనఖా పెట్టటంగానీ అమ్మడంగానీ చేసే దుస్థితికి దిగజారినట్టు సమాచారం. 2010లో పేషెంట్ ప్రొటెక్షన్ అండ్ ఎఫర్డబుల్ కేర్ యాక్ట్ (పీపీఏసీయే) న్యాయపరిధిలోకి తీసుకురావడం మూలంగా ఆరోగ్య బీమా పథకాలలో పెనుమార్పులు చోటుచేసుకున్నాయి. వైద్యరంగానికి సంబంధించిన వ్యవస్థ 2010 నాటికి వాడుకలో ఉన్న మామూలు పద్ధతుల్లో సమూలమైన మార్పులు తీసుకురావడం, ఫెడరల్ నిబంధనలకు అనుగుణంగా దూరదృష్టితో ప్రణాళికలను తయారుచేయడం వంటి చర్యలను తీసుకోవటం జరిగింది. అయితే, ఈ న్యాయపరమైన హక్కు చట్టంలో బీమా అర్హత, బీమా చెల్లింపు, బీమా ప్రీమియమ్ వైద్యంలో నైపుణ్యం, ఆర్థిక భారం మొదలైన అనేక అంశాల మీద నిరంతరాయంగా చర్చలు జరుగుతూనే ఉన్నాయి (బీమా చుట్టూ తిరిగే వైద్యం వల్ల అమెరికా ఆరోగ్య రంగం ఎంత ఖర్చు చేస్తున్నా ప్రజలకు సరైన ఫలితాలను అందించలేకపోతోందని లోక్‌సత్తా పలుమార్లు పేర్కొంది. 1948 నుంచి బ్రిటన్ అమలుచేస్తున్న సార్వత్రిక వైద్యనమూనా మెరుగైదని భావిస్తుంది. ఇప్పుడు అమెరికా ఎన్నికల్లో డెమోక్రాటిక్ అభ్యర్థిగా పోటీపడ్డ బెర్నీ శాండర్స్ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. భారత్‌లో కూడా బీమా వైద్యం ఫలితాలనివ్వలేదని గత కొన్నేళ్ల అనుభవాలు చెబుతున్నా తాజాగా మోదీ ప్రభుత్వం మళ్లీ బీమా మార్గాన్నే అనుసరిస్తోంది. ఈ అరకొర ఫలితాల బీమా ఆరోగ్య విధానం స్థానంలో బ్రిటన్ నమూనాలో అందరికీ అందుబాటులో ఆరోగ్యం అందించే విధానం కోసమే లోక్‌సత్తా ప్రయత్నిస్తోంది). ఏదేశమైనా ప్రజలకు అందుబాటులో వైద్యం, ఆరోగ్యం అందించాలంటే అనేకరకాలైన ఒడిదుడుకులను ఎదుర్కోవలసి ఉంటుంది. ముఖ్యంగా పేద, దిగువ మధ్యతరగతివారికి, వృద్ధులకు ఆరోగ్య సేవలను అందించేందుకు చాలా ముందుచూపుతో స్పష్టమైన విధానాలను రూపొందించాలి. టీకాలు అందుబాటులోకి రావటం, సాంకేతికత పెరగటం, ఆరోగ్యంపై స్పృహ పెరగటం, ఆర్థిక వృద్ధితో జీవన ప్రమాణాలు పెరగటం వంటి కారణాల వల్ల ఆయుర్దాయం పెరగటం వల్ల వృద్ధుల సంఖ్య కూడా పెరుగుతోంది. దీర్ఘకాలం జీవించాలనే లక్ష్యానికి తగిన వైద్యం, ఆరోగ్యం అందుతుండాలి. ప్రభుత్వాలే ఈ బాధ్యత తీసుకోవాలి. నిబద్ధతతో పన్నులు చెల్లించే సంస్కృతిగల దేశాలే ఆరోగ్య ఖర్చుల భారం మోయలేక అవస్థలు పడుతున్నాయి. అయితే తక్కువ ఖర్చుతో మందుల తయారీ, నిపుణులైన వైద్యులున్న భారత్‌ఉన్న బడ్జెట్‌లోనే అందరికీ మంచి ఆరోగ్యాన్ని అందుబాటులోకి తేగలదని లోక్‌సత్తా గణాంకాలతో, గత కృషి ఫలితాల సాక్ష్యాలతో స్పష్టంచేస్తోంది. యూపీయే ప్రభుత్వం వెచ్చించిన దానికి రెట్టింపు ఆరోగ్యరంగానికి కేటాయిస్తామని ఎన్నికలలో హామీ ఇచ్చిన నరేంద్ర మోదీ సర్కారు మాట నిలబెట్టుకోవాలి. జాతీయ ఆరోగ్య మిషన్‌కి కొనసాగింపుగా లోక్‌సత్తా చేస్తున్న ప్రయత్నాన్ని వినియోగించుకుని జేబులో నుంచి రూపాయి ఖర్చు లేకుండా అందరికీ ఆరోగ్యం అందించాలి.

అమెరికాలోని ఆసుపత్రుల నియంత్రణ, సేవల్లో నాణ్యతకు సంబంధించి వైద్యులు, ఫార్మసీల బాధ్యత తదితర అంశాలపై మరోసారి చర్చించుకుందాం. ❒

# సన్నాహక కమిటీ, జిల్లా సదస్సులు, జూన్‌లో విస్తృత సదస్సు

# ఐదు అంశాలపై కార్యక్రమాలతో లోక్‌సత్తా 2.0: జేపీ



ఇరవై ఏళ్ల లోక్‌సత్తా ప్రారంభించిన మలిదశ ఉద్యమాన్ని రెండు తెలుగు రాష్ట్రాలలో పటిష్టంగా నిర్మించేందుకు సన్నాహక కమిటీని ఏర్పాటు చేయటంతో పాటు వచ్చే నెలా ఖరువరకు జిల్లాల్లో సదస్సుల్ని, అక్కడ్నుంచి మునిసి పాలిటీలలో చైతన్య కార్యక్రమాల్ని నిర్వహించాలని నిర్ణ యించినట్టు లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ తెలిపారు. జూన్ మొదటివారంలో హైదరాబాద్‌లో విస్తృతస్థాయి సదస్సును నిర్వహించి ఎజెండాపై ప్రజల్లోకి పెద్దఎత్తున కార్యక్రమాల నిర్వహణను రూపొందించనున్నట్టు తెలిపారు. యువత, మహిళలకు పెద్దఎత్తున ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించామన్నారు. సన్నాహక కమిటీలో ప్రతి జిల్లా నుంచి ఒక సభ్యునితో మొత్తం 30మంది సభ్యులుంటారని, సీనియర్ నేతలు పి. చిదంబరరావు, టీఎల్ నరసింహారావు, పి. కోదండరామారావు, ఎన్. శ్రీనివాస్, పి. భాస్కరరావు సలహాదారులుగా, లోక్‌సత్తాకు పద్దెనిమిదేళ్లుగా సేవలందిస్తున్న బండారు రామ్మోహనరావు ప్రచార సమన్వయకర్తగా వ్యవహరిస్తారని తెలిపారు.

లోక్‌సత్తా మలిదశ ఉద్యమం (లోక్‌సత్తా 2.0) కార్యాచరణను ఖరారు చేసేందుకు ఏప్రిల్ 10న హైదరాబాద్‌లో నిర్వహించిన మేధోమథన సదస్సులో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చిన లోక్‌సత్తా ప్రతినిధులు పాల్గొన్నారు. లోక్‌సత్తా గత రెండు దశాబ్దాలలో చేసిన కృషిని, పరిణామాలను వివరించే కీలక ప్రసంగంతో జయప్రకాష్ నారాయణ్ సమావేశాన్ని ప్రారంభించారు. ఇన్నేళ్ల అనుభవాలతో, ఇప్పుడు నెలకొన్న పరిస్థితులలో తీసుకోవాల్సిన ఎజెండాను ప్రతిపాదించారు. ప్రతినిధులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానమిచ్చారు. అనంతరం సమావేశం లోక్‌సత్తా 2.0పై విస్తృతంగా చర్చించి కార్యాచరణకు ప్రాతిపదికల్ని, ఎజెండాను ఖరారు చేసింది.

వివరాలను జేపీ మీడియాకు తెలియచేస్తూ.. దేశాన్ని పాలించాలని తపించే పార్టీల మధ్య దేశాన్ని మార్చాలనే ఎజెండాతో లోక్‌సత్తా వచ్చిందని, ఇది తరాల కృషి అని అన్నారు. ఎన్నో మతాలు,కకులాలు, ప్రాంతాలు, భాషలు, ఇతర సంక్లిష్టతలు ఉన్న దేశంలో కొత్త రాజకీయ సంస్కృతితో ఒక్క పార్లమెంటు సభ్యుడు కూడా లేకుండా, శాంతియుతంగా, వినూత్న పద్ధతుల్లో 15, 16 మౌలిక మార్పు విజయాల్ని సాధించిందన్నారు. ఆటగాళ్లు కాదు ఆటనియమాలు మార్చాలి, రాజకీయాలు పవిత్ర వ్యాసంగంగా మారాలి అని లోక్‌సత్తా మొదటినుంచీ వాదిస్తోందని, రాజకీయాల్లో రావలసినన్ని ఓట్లు రాకపోవటం వల్ల శక్తిని వృధా చేసుకోకుండా ఫలితాలను సాధించటం కోసమే నూతన ఉద్యమ మార్గంలో ప్రయత్నిస్తున్నాం తప్ప రాజకీయం తప్పు అని ఇప్పుడు కూడా అనటం లేదన్నారు. రాజకీయాల్ని తిడుతూనైనా మార్చాలి అని యువత కొంతైనా ప్రయత్నిస్తుండటానికి లోక్‌సత్తా కృషే ప్రధానకారణమన్నారు. ఇరవయ్యేళ్ల అనుభవం నేపథ్యంలో లోక్‌సత్తా మౌలిక విధానాలలో ఎటువంటి మార్పూ అవసరంలేదని స్పష్టంగా అర్థమవుతోందని, అయితే ప్రజలకు పాలనలో, రాజకీయంలో భాగస్వామ్యం లేకుండా లోక్‌సత్తా ఆశించిన అన్ని మార్పులనూ, ఎన్నికలలో ఓట్లనూ సాధించటం కష్టమని గుర్తించామన్నారు. మార్కెట్ స్వేచ్ఛకు అవకాశమున్న చోటల్లా లోక్‌సత్తా తెచ్చిన చట్టాల వల్ల ఫలితాలు వచ్చాయని,

పోటీ తత్వంతో ప్రజల ప్రమేయంలేకుండానే వారికి మేలు జరిగిందని, కానీ ప్రజలు డిమాండ్‌గా రావాల్సిన విద్య, ఆరోగ్యం, స్థానిక కోర్టులు, స్థానిక ప్రభుత్వాలు వంటి చోట్ల చాలా నెమ్మదిగా అడుగులు పడుతున్నాయని అన్నారు. అధికార వికేంద్రీకరణ, ప్రజల భాగస్వామ్యం లేకపోవటం వల్ల ఇలాంటి విలువైన మార్పులు అసాధ్యమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా గుర్తించలేకపోతున్నారని, అందుకే స్వచ్ఛభారత్ వంటి కార్యక్రమాలు ఎంత డబ్బు ఖర్చు చేసినా చట్టబద్ధ ఆదేశాలిచ్చినా ఫలితాలు రావటం లేదన్నారు. పంచాయతీల్లో ఏం జరగాలో స్థానిక స్థాయికి వదిలేయకుండా రాజ్యాంగమే చెప్పటం వల్ల 73, 74 సవరణలు విఫలమయ్యాయని, అలాగే విద్యాహక్కు చట్టం, ఆహారభద్రతా చట్టం, భూసేకరణ చట్టం వంటివి ప్రచ్ఛన్న కేంద్రీకరణ, ఢిల్లీ పెత్తనం వల్ల ప్రయోజనం లేకుండా పోతున్నాయని అన్నారు. ఈ అనుభవం నేపథ్యంలో లోక్‌సత్తా 2.0 కార్యాచరణను ఖరారు చేసుకున్నామని, మొక్కుబడిగా కాకుండా ఒడుపుగా, ఆలోచనతో లక్ష్యాలను సాధించగలిగే అంశాలను ఎంచుకున్నామని తెలిపారు.

"+ కేంద్రం అధికారాలకి, దేశ సమగ్రతకి భంగం లేకుండా రాష్ట్రాలకు పూర్తి స్వయం నిర్ణయాధికారాలనిచ్చి ప్రజలకి పూర్తిస్థాయిలో సేవలందించే వెసులుబాటునివ్వటం

+ ఉత్తమ ప్రమాణాల విద్యని ప్రతి బిడ్డకీ అందించటం, ప్రతి కుటుంబానికీ జేబులో ఖర్చు లేకుండా ఉత్తమ ప్రమాణాల ఆరోగ్యాన్నందించే వ్యవస్థని ఏర్పరచటం

+ స్థానిక ప్రభుత్వాలకి, పౌరులకి పూర్తి బాధ్యతలు, పన్నుల్లో వాటాని అందించి స్థానికంగా సమస్యల పరిష్కారంలో, విధానాల అమలులో వారిని పూర్తి భాగస్వాములని చేయటం.

వీటితోపాటు, ప్రజల్ని చీలుస్తూ సమాజాన్ని ఇంకా నష్టపరుస్తున్న శతాబ్దాల అమానుష కులవ్యవస్థకు వ్యతిరేకంగా ప్రజల్ని చైతన్యపరిచి కులరహిత సమాజం దిశగా నడిపించటం, పరిజ్ఞానంతో ప్రశ్నించే యువనాయకులను ఎక్కడికక్కడ తయారుచేసేందుకు పౌరసత్వ శిక్షణా కార్యక్రమాలను నిర్వహించటం కార్యక్రమాల్ని కూడా సామాజిక సంస్కరణ కార్యక్రమాలుగా చేపట్టటం అవసరమని లోక్‌సత్తా మలిదశ ఉద్యమం భావిస్తున్నట్టు" జేపీ తెలిపారు. లోక్‌సత్తా చేస్తున్న రాజకీయ, ఎన్నికల, న్యాయ, పోలీసు సంస్కరణలను కొనసాగిస్తూనే వీటిని చేపడతామన్నారు.

'అందరికీ ఆరోగ్యం' విధానంపై ఏప్రిల్ 23 ఢిల్లీలో రౌండ్‌టేబుల్, 25 నీతి ఆయోగ్ ముందు ప్రజెంటేషన్

ఆర్థికాభివృద్ధి ఎంత జరిగినా దేశజనాభాలో 80శాతం మందికి అవకాశాలు లేకుండా ఈదేశం ముందుకెళ్లదని, వారికి అవకాశాలివ్వాలంటే ప్రభుత్వం ముందున్న మార్గం అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం మాత్రమేనని జేపీ స్పష్టంచేశారు. అందరికీ ఆరోగ్యం కోసం లోక్‌సత్తా జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా కొంత సాధించిందని, ఇప్పుడు సమగ్ర విధానం కోసం కృషి చేస్తోందన్నారు. అందులో భాగంగా ఢిల్లీలో ఏప్రిల్ 23న వైద్యనిపుణులతో, ఈరంగంలో విజయాలు సాధించినవారితో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నామని, 25న నీతి ఆయోగ్ ఆహ్వానం మేరకు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరిస్తామని, తర్వాత ప్రధానమంత్రిని, అన్ని పార్టీలనూ కలిసి అందరికీ ఆరోగ్య విధానాన్ని అమలును సాధించేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఈ దేశంలో ఢిల్లీ నుంచి మారుమూల పల్లెలోని వ్యక్తి వరకూ జేబులో నుంచి రూపాయి ఖర్చు లేకుండా తక్కువ ఖర్చుతోనే వైద్యం అందించేలా లోక్‌సత్తా విధానాన్ని రూపొందించిందన్నారు. దీంట్లో భాగంగా, ప్రతి 5,000మందికి ఒక డాక్టర్ అందుబాటులో ఉంటారని, వైద్యసేవలకు నచ్చిన డాక్టర్‌ని ఎంపిక చేసుకునే హక్కు కూడా రోగులకు ఉంటుందని, ప్రభుత్వమే డబ్బు చెల్లిస్తుందని తెలిపారు. దేశ ప్రజల ఆరోగ్యవివరాలన్నీ నమోదు చేసి సేవలందిస్తారన్నారు. వైద్యులు ఎక్కడున్నా గ్రామీణ ప్రాంతాలకు కూడా నిత్యం అందుబాటులో ఉంటారన్నారు. ఈ ఆరోగ్య విధానం అమలైతే దేశంలోని పేదలకు, అణగారిన వర్గాలకు గొప్ప మేలు జరుగుతుందన్నారు.

రాస్తారోకోల మార్గంలోకెళ్లం, లోక్‌సత్తా పోరాటపంథాను కొనసాగిస్తాం

తర్కం, సాక్ష్యాలు ఆధారంగా పాటించే బహిరంగ చర్చ ప్రమాణాతో ప్రజాస్వామ్యయుతంగా లోక్‌సత్తా సాగించే పోరాట పంథాను కొనసాగించాలని సమావేశం అభిప్రాయపడినట్టు జేపీ చెప్పారు. స్వతంత్రం వచ్చాక బంద్‌లు, రాస్తారోకోలు వంటి మార్గాల వల్ల కాకుండా పౌరసత్వంతో, రాజ్యాంగం ఇచ్చిన మార్గాలతో పోరాడాలి అన్న అంబేద్కర్ మాటల్ని లోక్‌సత్తా ఆచరించి చూపించిందన్నారు. మిగతావాళ్లు విధ్వంసాలు, అరాచకత్వాలకు పాల్పడి సాధించిన విజయాలకంటే లోక్‌సత్తా వినూత్న పద్ధతులతో రాజ్యాంగ విలువలతో సాధించిన విజయాలు చాలా ఎక్కువన్నారు. కొంతమంది వ్యక్తులు విధ్వంసాలు, హింసతో దేశాన్ని శాసించాలనుకోవటం తాత్కాలికంగా సంచలన వార్తలకి పనికొస్తుందిగానీ దీర్ఘకాలంలో దేశ ప్రయోజనాలకు తీవ్ర నష్టం చేకూరుస్తుందని, అది ప్రజాస్వామ్యాన్ని కూల్చేస్తుందని అన్నారు. కేరళ కొల్లం జిల్లాలోని

(తరువాయి 31వ పేజీలో.....)

# 'పటిష్ట వైద్యరంగమే' ప్రజారోగ్యానికి 'బీమా'

- డా॥ జయప్రకాష్ నారాయణ్

నిరుపేదల్లో నెలకొన్న అసంతృప్తికి మొన్నటి లోక్‌సభ ఎన్నికల ఫలితం దర్పణం పట్టిందని చెప్పవచ్చు. అంతమాత్రాన, భారత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి దిశగా అడుగులు వేయడం లేదని ఎవరూ అనజాలరు. శక్తిసామర్థ్యాలకు తగినట్టుగా మన పనితీరు లేకపోయినా వృద్ధి రేటు మాత్రం ఆరు నుంచి ఏడు శాతం ఉందన్నది నిర్వివాదాంశం. ఇక్కడ రెండు ప్రధాన అంశాలపై దృష్టి సారించవలసిన అవసరం ఉంది. ఎనిమిది శాతం వృద్ధిరేటును సాధించడమన్నది అందులో ఒకటి. ఉత్పాదక రంగాలకు వనరుల కేటాయింపు, సంస్థల పునర్నిర్మాణం, ఖర్చు చేసే ప్రతి రూపాయికి సరైన విలువ రాబట్టడం ద్వారా ఎనిమిది శాతం సుస్థిర వృద్ధిరేటు సాధ్యమవుతుంది. సామాజికంగా, ప్రాంతీయపరంగా అసమానతలు పెచ్చుమీరిపోతున్నాయన్నది రెండవ అంశం. అలాగే, పెరిగిపోతున్న ప్రజల ఆకాంక్షలను ప్రభుత్వాలు తీసుకునే అరకొర చర్యలు నెరవేర్చలేకపోతున్నాయి. వీటిని దీటుగా ఎదుర్కోగలగాలి. వాస్తవానికి గత ఎన్నికలలో ప్రజలు ఇచ్చిన తీర్పు ఆర్థిక సంస్కరణలకు వ్యతిరేకంగా కాదు, బడుగు జీవుల అవసరాలను, ఆకాంక్షలనూ తీర్చే విధంగా వృద్ధి ప్రక్రియ మరింత ఊపందుకోవాలన్నదే ప్రజాతీర్పులోని ఆంతర్యం.




మరింత వేగవంతంగా అందరికీ అభివృద్ధి ఫలాలు అందాలన్న అభిప్రాయంతో అంతా ఏకీభవిస్తారు. నిజమే. అయితే, అభివృద్ధిని ఎలా సాధించాలనే విషయంలో స్పష్టత కొరవడింది. మనం కన్న కలలన్నీ సాకారమయ్యేట్టు ఉంటే, పేదరికాన్ని ఎప్పుడో అధిగమించి ఉండేవాళ్లం. వాస్తవంగా, పరిమిత వనరులకూ– అపరిమితమైన ప్రజల ఆకాంక్షలకూ మధ్య సమతూకం సాధించలేక ప్రభుత్వాలు సతమతమవుతూ ఉంటాయి. ధనిక దేశంగా అంతా చెప్పుకునే అమెరికాతో సహా ఏ దేశమూ అవసరాలకు మించిన అదనపు వనరులతో తులతూగటం లేదన్నది కఠోర సత్యం. దశాబ్దానికిపైగా చక్కటి వృద్ధి రేటుతో ప్రగతిబాటలో పయనించిన అమెరికా ఇప్పుడు అనూహ్యమైనరీతిలో ఆర్థిక లోటులో పడటానికి కారణమిదే. 2006 నాటికి అమెరికా ఆర్థికలోటు 82,500 కోట్ల డాలర్లకు (అమెరికా స్థూలదేశీయోత్పత్తిలో 6.4శాతం) చేరుకుంటుందని 'ది ఎకనమిస్ట్' పత్రిక విశ్లేషించింది. ప్రస్తుత మారక విలువ ప్రకారం చూస్తే, 2006 నాటికి అమెరికా ఆర్థికలోటు ఇండియా స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) కంటే ఎక్కువగా ఉంటుంది. 'సూపర్ పవర్' అమెరికా పరిస్థితే ఇలా ఉన్నప్పుడు, ఇండియాలాంటి దేశాలు అవసరాలకు తగిన విధంగా వనరులను సమీకరించుకోవడంలో అవరోధాలు ఎదుర్కొంటున్నాయంటే ఆశ్చర్యం ఏముంది?

**అవకాశాలు అపారం**

అభివృద్ధితోపాటే సమానతనూ సాధించడానికి మనం దృష్టి సారిస్తున్న రంగాలు ఏమైనా ఉన్నాయా? నిజానికి సిద్ధాంత కర్తలు అభివృద్ధిని, సమానతను ఒకదానితో ఒకటి పొంతన లేకుండా వాటిని రెండు భిన్నధృవాలకు పరిమితం చేశారు. గత అనుభవాల నుంచి మనం గుణపాఠాలను నేర్చుకున్నట్లయితే, వృద్ధి, సమానత ఒకదానిని ఒకటి పరస్పరం బలోపేతం చేసినప్పుడే అవి సుస్థిరంగా ఉండగలుగుతాయి. విద్య, ఆరోగ్య పరిరక్షణ, మౌలిక సదుపాయాలు, సహజ వనరుల అభివృద్ధి, చట్టసంస్థలు, సుపరిపాలన వంటి రంగాలన్నీ వృద్ధినీ, సమానతనూ పెంపొందించేవే. ఇతర దేశాలతో పోలిస్తే, కొన్ని రంగాల్లో ఇండియాలో తక్కువ

పెట్టుబడులతో ప్రజలకు గరిష్టంగా మేలుచేసే అవకాశాలు అపారంగా ఉన్నాయి. ఈ రంగాలపై దృష్టి సారించడం ద్వారా వనరులు, వృద్ధి-సమానత వంటి అంశాలలో ఎదురవుతున్న సమస్యలను ఏకకాలంలో అధిగమించవచ్చు.

ఆరోగ్యరంగంలో ప్రస్తుతం నెలకొన్న సంక్షోభానికి గల కారణాలు ఎంతో ఆందోళన కలిగించేవిగా ఉన్నాయి. ఆధునిక ప్రమాణాల ప్రకారం మన ఆరోగ్య సూచికలు అథమస్థాయిని అంటుతున్నాయి. ప్రజారోగ్యంపై ప్రభుత్వం చేస్తున్న వ్యయం జీడీపీలో 0.9శాతం మాత్రమే. 1990లో ఇది 1.3శాతంగా ఉండేది. ఆరోగ్యంపై వెచ్చిస్తున్న మొత్తంలో ప్రభుత్వ వాటా కేవలం 17శాతం, రోగాల వాతపడుతున్న వారిలో 80శాతం మంది అవుట్ పేషెంట్లు, 60శాతం మంది ఇన్‌పేషెంట్లు ప్రయివేటు క్లినిక్‌లను, నర్సింగ్ హోంలను ఆశ్రయిస్తున్నారు. రోగాల బారినపడి ఆసుపత్రిపాలయ్యే భారతీయులు తమ వార్షికాదాయంలో 60శాతం డబ్బును వైద్యసేవలకే వెచ్చించవలసి వస్తోంది. దీంతో వారి ఆర్థిక పరిస్థితి తలకిందులవుతోంది. ఆసుపత్రులలో చేరినవారిలో 40శాతంమంది ఖర్చులు భరించే స్తోమత లేక ఆస్తుల్ని తెగనమ్ముకోవడమో, అధిక వడ్డీలకు డబ్బు తీసుకుని అప్పులపాలు కావడమో జరుగుతోంది. వీరిలో 25శాతం మంది దారిద్ర్యరేఖకు దిగువన చేరుతున్నారు. ఇలాంటివారి సంఖ్య కేరళలో 17శాతం ఉంటే, బీహార్‌లో 35శాతంగా ఉంది. పరిస్థితి ఇంత ఆందోళన కలిగించేదిగా ఉన్నప్పటికీ మనదేశంలో ఆరోగ్యరంగం అభివృద్ధిపై ఆశలు ఇంకా సజీవంగానే ఉన్నాయి. ఇతర నిరుపేద దేశాలతో పోలిస్తే ఇండియాకు ఎన్నో అంశాలు సానుకూలంగా ఉన్నాయి. నిపుణతతో కూడిన మానవవనరులకు మనకు కొదవలేదు.

మారుతున్న అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను మెరుగుపరచుకునే శక్తిసామర్థ్యాలు మనకున్నాయి. ప్రయివేటు ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాలు గణనీయంగా వృద్ధి చెందుతున్నాయి. మనదేశంలోని ఔషధ పరిశ్రమ అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా ఎదిగింది. ఇక్కడ ఔషధాలు అతి తక్కువ ధరలకు లభిస్తాయి. మశూచి వంటి వ్యాధులపై భారీస్థాయిలో ప్రచారభేరి మోగించాం. పోలియో, కుష్టు వ్యాధులను దాదాపుగా నిర్మూలించగలిగాం. గ్రామీణ ప్రాంతాలలో ఉన్న ఐదు లక్షల మంది ఆర్.ఎం.పిలు రోగుల ప్రాథమిక వైద్య అవసరాలను తీర్చగలుగుతున్నారు. ఆరోగ్య రంగాన్ని పటిష్టంగా తీర్చిదిద్దేందుకు, వృద్ధి సమానతలను పెంపొందించేందుకు ఈ సానుకూలతలన్నింటినీ ఉపయోగించుకోవాలి. ఆరోగ్య పరిరక్షణకు అమెరికా చేస్తున్న తలసరి వ్యయం 4600 డాలర్లుకాగా, ఇందులో మూడోవంతు... 1700 డాలర్ల వ్యయంతోనే బ్రిటన్ అత్యున్నతమైన వైద్యసేవలు అందించగలుగుతోంది. ఇందుకు కారణం అక్కడ అందరికీ ఆరోగ్యాన్నిచ్చే జాతీయ వైద్య ఆరోగ్య విధానం (నేషనల్ హెల్త్ సర్వీస్)ని ప్రవేశపెట్టడమే. 1948లో అప్పటి బ్రిటీష్ ప్రధాని అట్లీ ప్రవేశపెట్టిన ఈ విధానం ఎన్నో సత్ఫలితాలను అందిస్తోంది. బ్రిటన్ తరహాలో మనదేశంలోనూ ఇలాంటి విధానాన్ని అమలుచేయడం ద్వారా ప్రజలకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్యసేవలను అందుబాటులోకి తీసుకురావచ్చు.

యు.పి.ఎ ప్రభుత్వం తన కనీస ఉమ్మడి కార్యక్రమంలో ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇచ్చింది. ఆరోగ్యరంగంపై ప్రభుత్వ వ్యయాన్ని జీడీపీలో 0.9శాతం నుంచి రెండు లేదా మూడు శాతానికి పెంచుతామని హామీ ఇచ్చింది. నిజానికి- జీడీపీలో 0.3శాతం అదనపు వ్యయంతోనైనా ఆరోగ్య రంగంలో సమూలమైన మార్పుల్ని తీసుకురావచ్చు. ప్రజారోగ్య వ్యవస్థను పటుతరం చేసేందుకు జాతీయ సలహా మండలి (ఎన్ఏసీ- ఇందులో జేపీ కూడా సభ్యులుగా చేశారు) ఓ సమగ్రమైన పథకాన్ని రూపొందించి, ప్రధానమంత్రికి అందచేసింది. ఇందులో ఐదు వ్యూహాత్మక చర్యలను సూచించింది. అవి 1. ఇమ్యూనైజేషన్, శిశు సంరక్షణ, వ్యాధుల నిరోధం, పునరుత్పత్తి వంటి అంశాలలో ప్రజలకు సాయపడేందుకు పది లక్షలమంది మహిళా సామాజిక ఆరోగ్య కార్యకర్తలను తయారుచేయడం (వీరంతా ఆయా పంచాయతీల పరిధిలో పనిచేస్తారు) 2. అత్యవసర మందుల కొరత, మౌలిక సదుపాయాల లేమి వంటి సమస్యలను అధిగమించడం 3. భారీస్థాయిలో జాతీయ పారిశుద్ధ్య కార్యక్రమాన్ని చేపట్టడం (ఈ పథకం కింద నిరుపేదల కోసం ఇంటికో మరుగుదొడ్డి చొప్పున ఐదేళ్లలో పది కోట్ల మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలి. దీనికయ్యే వ్యయంలో సగం ప్రభుత్వమే భరించాలి) 4. దేశ జనాభాలో ప్రతి లక్షమందికి ఒకటి చొప్పున ఐదేళ్లలో ఏడువేల 30-50 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్లను నిర్మించడంతోపాటు రిఫరల్ ఆసుపత్రులుగా ఉపయోగపడే ఈ సెంటర్ల ద్వారా నాణ్యమైన వైద్యసేవలు అందించాలి 5. స్తోమతు కలిగిన పౌరుల నుంచి ప్రతి మనిషికి 100 రూపాయల చొప్పున స్థానిక ఆరోగ్య పన్నును వసూలు చేయాలి. దీనికితోడుగా తలక్కింటికి అంతే మొత్తంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ నిధికి తమ వంతు వాటాను జతచేయాలి. ఈ మొత్తాన్ని జిల్లా ఆరోగ్యబోర్డుల అధీనంలో ఉంచి వీటిపై స్థానిక ప్రభుత్వాలకు నియంత్రణాధికారం కల్పించాలి. ప్రామాణిక ధరల ఆధారంగా ఆయా ప్రభుత్వ ఆసుపత్రులు ప్రజలకు అందచేసిన వైద్యసేవలకు ప్రతిఫలంగా వాటికి తిరిగి

చెల్లించేందుకు ఈ నిధుల్ని వినియోగించాలి. తమ జిల్లా పరిధిలో ఉన్న ఏ ఆసుపత్రిలోనైనా వైద్యసేవలు పొందే వెసులుబాటును రోగులకు కల్పించాలి. ఆసుపత్రులు నాణ్యమైన సేవలు అందించి, అందుకు జిల్లా ఆరోగ్యబోర్డుల నుంచి ప్రతిఫలాన్ని తీసుకోవాలి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో తగిన వైద్యసేవలు అందనప్పుడు, ప్రయివేటు ఆసుపత్రులకు అవకాశం కల్పించి అందుకయ్యే ఖర్చులను జిల్లా ఆరోగ్యబోర్డులు చెల్లించాలి.

**అందరి తోడ్పాటు అవసరం**

వైద్యరంగంలో మౌలిక సదుపాయాల వృద్ధి, స్థానికంగా జవాబుదారీతనం పెంచటానికి, ప్రజల ముందు మరిన్ని ప్రత్యామ్నాయాలు ఉంచటానికి ఎన్ఏపీ ప్రతిపాదనలు దోహదపడతాయి. ఒక విధంగా చెప్పాలంటే– ప్రభుత్వ–ప్రయివేటు భాగస్వామ్యంతో అందరికీ ఆరోగ్యం అందించే జాతీయ వైద్య ఆరోగ్య సర్వీస్ ఏర్పాటుకి ఇవి పునాదులవంటివి. స్వల్పకాలిక పెట్టుబడులను పక్కనపెడితే, ఈ ప్రతిపాదనలన్నీ కార్యరూపం దాల్చడానికి అయ్యే వ్యయం రూ. 7,000 కోట్లకు మించదు.

ఈ ఆధునిక యుగంలో కూడా లక్షలాదిమంది పేద మధ్యతరగతి ప్రనజలు అనారోగ్యంతో తీవ్ర అవస్థలుపడటం సిగ్గుచేటైన విషయం. నాణ్యతతో కూడిన వైద్యసేవలు అందించేలా ఆరోగ్యరంగాన్ని తీర్చిదిద్దేందుకు, వృద్ధి ఉత్పాదకతనూ పెంచేందుకు కావలసిన మౌలిక సదుపాయాలు, సంస్థాగతమైన శక్తిసామర్థ్యాలు.. అన్నింటినీ మించిన నైపుణ్యత మనకున్నాయి. వీటన్నిటినీ ఉపయోగించుకుని చక్కటి ఆరోగ్య పరిరక్షణ వ్యవస్థ ఏర్పాటుపై రాజకీయ నాయకులు, ఆర్థికవేత్తలు, విధానకర్తలు దృష్టి సారించాలి. తక్కువ ఖర్చుతో ప్రతి ఒక్కరికీ జేబులో నుంచి ఖర్చు లేకుండా నాణ్యమైన వైద్యసేవలు అందించే నేషనల్ హెల్త్ సర్వీస్ రూపకల్పనకు నడుంబిగించాలి.

(జేపీ 'భవిష్యత్ భారతం' కాలమ్‌లో భాగంగా డిసెంబర్ 13, 2004న ఈనాడులో ప్రచురితమైన వ్యాసం) ❐

---

**(28వ పేజీ తరువాయి .....)**


దేవాలయంలో జరిగిన అగ్నిప్రమాదం కావచ్చు, అంతకుముందు కోల్‌కతాలో నిర్మాణంలోని ఫ్లైఓవర్ కూలిపోవటం కావచ్చు ఎవరూ బాధ్యత తీసుకోరు, ఇకముందు అలాంటి ప్రమాదాలు జరగకుండా ఏంచేయాలో ఆలోచించరని, అలాగే పనామా పత్రాల వంటి విషయాల్లో సంచలనాలు తప్ప చర్యలకు చొరవ ఉండదని, అలాంటి వ్యవస్థను మార్చటం లక్ష్యంగా లోక్‌సత్తా పనిచేస్తోందన్నారు. లోక్‌సత్తా తన భావజాలాన్ని ప్రజల్లో చర్చకు పెట్టి ప్రచారం చేసి 1998, అక్టోబర్ 2న 'స్వరాజ్యం' అనే పౌరహక్కుల పుస్తకాన్ని ఆవిష్కరించిన అనంతరం తొలి కార్యాచరణగా పెట్రోలు బంకుల్లో తూనికల అక్రమాల నియంత్రణను తీసుకుందని తెలిపారు. ఆటోవారిని, లారీలవారిని రెచ్చగొట్టి ఒక రాస్తారోకోలాగా చేసి ఉంటే పెద్ద ప్రచారం వచ్చి ఉండేదని, కానీ ఎంతో మెళకువతో చట్టబద్ధంగా కొలతలు మార్కింగ్ చేసిన క్యాన్‌లతో పెట్రోలు బంకుల వద్ద ప్రశ్నించటం వల్ల తూనికల్లో అక్రమాలు బైటపడ్డాయని, క్రమంగా దేశవ్యాప్తంగా 90శాతం తూనికల్ని దీంతో సరిచేశారని అన్నారు. ఎవరైనా లెక్కతీస్తే ఇన్నేళ్లలో ఈ ఒక్క పోరాటం ద్వారానే లోక్‌సత్తా వల్ల కనీసం రూ. 2లక్షల కోట్ల ఆదాయం ప్రజలకు లభించి ఉంటుందన్నారు. ఒక ప్రజాస్వామ్య దేశంలో చేయాల్సిన నిజమైన పోరాటాలకు ఇది ఒక కేస్ స్టడీగా నిలుస్తుందన్నారు. ఉద్యమాలు, గొప్ప ఆందోళనలు చేస్తున్నామని చెప్పుకుంటున్నవాళ్లు ఇన్నేళ్లలో ప్రచారం తప్ప లోక్‌సత్తా కంటే సాధించిన ఫలితాలు ఏమిటి? అని ప్రశ్నించారు. సహకార సంఘాల స్వయంప్రతిపత్తి కోసం లోక్‌సత్తా కృషి వల్ల వచ్చిన 97వ రాజ్యాంగ సవరణ విలువ ఖచ్చితంగా రాబోయేకాలంలో ప్రజలు గుర్తిస్తారని, ఎన్నికైన వాళ్లు, జీతాలు తీసుకునే యంత్రాంగం తప్ప ప్రజల్ని డమ్మీలుగా మార్చేసిన రాజకీయంలో ప్రజలకు సాధికారత కల్పించే ప్రయత్నం చేసిందన్నారు. 2జీ స్పెక్ట్రం కేసులో రాజా, కనిమోళి వంటివారిని అరెస్టు చేయాలనే మిగతావారంతా కోరితే, అది చాలదు, లైసెన్సులు రద్దు కావాలి, ఇక మీదట సహజ వనరుల కేటాయింపుల్ని వేలం పద్ధతుల ద్వారానే చేయాలి అని పోరాడి లోక్‌సత్తా సాధించిందని, దానివల్ల దేశానికి స్పెక్ట్రం వేలంలో రూ. 1లక్ష కోట్లు, బొగ్గు వేలంలో రూ. 3లక్షల కోట్లు ఆదాయం వచ్చిందని అన్నారు. ఉన్నత న్యాయమూర్తుల నియామకానికి లోక్‌సత్తా పద్నాలుగేళ్ల కృషితో వచ్చిన జాతీయ జ్యుడీషియల్ కమిషన్ (ఎన్‌జేఏసీ) కొట్టివేసిన సుప్రీంకోర్టు ఖచ్చితంగా కొన్నేళ్ల తర్వాత తన తీర్పును వెనక్కి తీసుకుని తప్పును అంగీకరిస్తుందని, రాజకీయ వ్యవస్థ నైతికత పెరిగాక ఆ చట్టం ఎంత అవసరమో ప్రజలు కూడా గుర్తిస్తారని అన్నారు.

లోక్‌సత్తా మలిదశ ఉద్యమానికి ప్రజలు, ముఖ్యంగా దగాపడ్డవర్గాలు, మహిళలు, యువత పెద్దఎత్తున కలిసిరావాలని, మీడియా సహకరించాలని జయప్రకాష్ నారాయణ్ పిలుపునిచ్చారు. ❐

# కొనుగోలుదారులు కోర్టుల చుట్టూ తిరక్కుండా స్థిరాస్తి కేసుల వివరాలు తెలిపేలా రిజిస్ట్రేషన్ చట్టాన్ని సవరించండి: తెలంగాణ, ఏపీ ముఖ్యమంత్రులకు జేపీ లేఖలు



స్థిరాస్తి రిజిస్ట్రేషన్ చేయించుకున్నవారు ఎటువంటి కోర్టు కేసుల్లో ఇరుక్కోకుండా గ్యారంటీ పట్టా పొందేలా రిజిస్ట్రేషన్ చట్టాన్ని సవరించాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ముఖ్యమంత్రులు ఎన్. చంద్రబాబు నాయుడు, కె. చంద్రశేఖర రావులకు మంగళవారం వేర్వేరుగా లేఖలు రాశారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రస్తుతమున్న చట్టం ప్రకారం ఎంతో డబ్బు చెల్లించి స్థిరాస్తిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నా పట్టాకు గ్యారంటీ లేదని, ఏమైనా కోర్టు కేసుల్లో ఆ ఆస్తి ఉంటే అమాయకులైన కొనుగోలుదారులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఇలా భూ మాఫియాల వలలో చిక్కుకుని తాము జీవితకాలం కూడబెట్టిన డబ్బుతో స్థిరాస్తిని కొనుకున్నవారు అనేకమంది విలవిలలాడి పోతున్నారన్నారు. పరిష్కారం ఎప్పుడో తెలియకుండా ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరుగుతూ ఏటా అమాయకులు రూ.750 కోట్లు ఖర్చుచేస్తున్నారన్నారు. మహారాష్ట్ర, గుజరాత్ ప్రభుత్వాలు స్థిరాస్తి బదిలీ, భారత రిజిస్ట్రేషన్ (బోంబే సవరణ) చట్టంలోని సెక్షన్లను రాష్ట్ర ప్రభుత్వ చట్టంతో సవరించి కోర్టు గొడవల్లో స్థిరాస్తి కొనుగోలుదారులు చిక్కుకోకుండా చర్యలు తీసుకున్నాయని, అదేతరహాలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు కూడా కోర్టు వివాదాల్లో ఉన్న భూముల వివరాలను తప్పనిసరిగా కొనుగోలుదారులకు రిజిస్ట్రేషన్ సమయంలో తెలియచేసేలా ఆస్తి బదిలీ చట్టం, 1882లోని సెక్షన్ 52ను, భారత రిజిస్ట్రేషన్ చట్టం, 1908 సెక్షన్ 17 లేదా 18ని సవరించాలని విజ్ఞప్తి చేశారు. చట్టసవరణ ముసాయిదాను కూడా లేఖలకు జత చేశారు. భూ రికార్డులను డిజిటలైజ్ చేయటం ప్రభుత్వ భూములకే పరిమితం చేయకుండా పట్టా భూములకు కూడా వర్తింపచేయాలని జయప్రకాష్ నారాయణ్ రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులను కోరారు.



**స్థిరాస్తి రిజిస్ట్రేషన్ చట్ట సవరణ కోరుతూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులకు జయప్రకాష్ నారాయణ్ వేర్వేరుగా రాసిన లేఖల్ని లోక్‌సత్తా వర్గాలు మీడియాకు విడుదల చేశాయి. లేఖల స్థూలపాఠం:**

"అనేకమంది స్థిరాస్తి కొనుగోలు దారులు రాష్ట్రవ్యాప్తంగా, ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో, ఇతర పట్టణ ప్రాంతాలలో భూ మాఫియా మోసాలకు గురవుతున్నారు. మన చట్టపరమైన నిబంధనలు బలహీనంగా ఉన్నాయి. స్థిరాస్తిని కొనుగోలు చేసే మధ్యతరగతి, పేదవారు స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు కింద భారీ మొత్తం డబ్బును చెల్లిస్తున్నా భూమి పట్టాకు గ్యారంటీ ఉండటం లేదు. ప్రస్తుతం విధిస్తున్న స్టాంప్ డ్యూటీ వల్ల తెలంగాణ ప్రభుత్వానికి రూ.4,219.99, ఆంధ్రప్రదేశ్ సర్కారుకు రూ.5,180 కోట్లు ఆదాయం వస్తుందని 2016-17 బడ్జెట్ అంచనాలు తెలియచేస్తున్నాయి. దురదృష్టవశాత్తూ, అమాయక కొనుగోలుదారునికి పలు సందర్భాలలో ఆ భూమిపై కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న వివాదం గురించి తెలియదు. విలువైన భూమిని కొనుగోలు చేయడానికి ఒక మధ్యతరగతి లేదా పేద కుటుంబం తన జీవితకాలం దాచుకున్న డబ్బును వెచ్చిస్తుంది. అట్లా కొన్న స్థిరాస్తి వ్యాజ్యంలో ఉందని తెలిసినా లేదా ఆ అమ్మినవ్యక్తి ఇంకెవరికో కూడా అదే భూమిని అమ్మినా లేదా అమ్మినవ్యక్తి ఆ స్థలానికి అసలైన హక్కుదారు కాకున్నా అమాయక కొనుగోలుదారు వేదన వర్ణనాతీతం. ఆ కొనుగోలుదారు ఎంతో ఆందోళనకు గురవుతూ కోర్టు కేసుల్లో చిక్కుకోవటంతోపాటు జీవితకాలం రూపాయిరూపాయిగా కూడబెట్టిన సొమ్మును కోల్పోయి రోడ్డున పడతాడు.

2006లో నిజామాబాద్ జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించిన 'భూ భారతి' ప్రాజెక్టు స్థిరాస్తి అమ్మకందారులు, ప్రమోటర్లు, పేద కొనుగోలుదారులతోపాటు డాక్యుమెంట్ల ఆధారంగా రుణాలిచ్చే బ్యాంకులలో కూడా ఎన్నో ఆశలు రేకెత్తించింది. అయితే ఆ కార్యక్రమం అమలవకుండా ప్రజల ఆశలకు గండికొట్టింది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్మార్ట్ గవర్నమెంట్ అధ్యయనం ప్రకారం, పట్టణ శివారు భూముల్లో 28శాతం వివాదాల్లో ఉన్నాయి, పరిష్కారం ఎప్పుడో తెలియకుండా ఏటా రూ.750కోట్లు కక్షిదారులు ఖర్చుచేస్తున్నారు. స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు కింద ప్రజల నుంచి పెద్ద మొత్తాన్ని వసూలు చేస్తున్న ప్రభుత్వానికి అమాయక ప్రజలు కొనుగోలు చేస్తున్న ఆస్తుల టైటిల్‌ను పరిరక్షించాల్సిన బాధ్యత ఉంది.

భూ రికార్డులను బ్యాంకులకపర్యవేక్షణకు అందుబాటులో ఉంచాలని, రైతులకు తేలిగ్గా రుణాలు అందే ఏర్పాటుచేయాలని, ఒకే భూమికి రెండు రిజిస్ట్రేషన్లను అరికట్టాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు సానుకూలామైనవి. ఇటీవల రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు ప్రారంభించిన భూ రికార్డుల డిజిటలైజేషన్ కార్యక్రమం ప్రభుత్వ భూములనే కాకుండా పట్టా భూములను కూడా పరిరక్షించాలి. అయితే చట్టపరమైన కొన్ని లసుగుల్ని సవరించి, ఆచరణాత్మకమైన కొన్ని చర్యల్ని చేపట్టాల్సుంది.

ఇక ముందు కొనుగోలుదారులు తాము కొనాలనుకుంటున్న స్థిరాస్తిపై ఏవైనా వ్యాజ్యాలు నడుస్తున్నాయా, డిక్రీ, అటాచ్‌మెంట్ వంటి వాటి పరిధిలో ఉందా అనే అంశాలను తెలుసుకోవటానికి ఒక ఏర్పాటును చేయాల్సిన అవసరం గురించే ఈ లేఖ రాస్తున్నాను. ఏటా స్థిరాస్తిని కొనుగోలుచేస్తున్న వేలాదిమందికి తాము కొంటున్న భూములపై న్యాయవివాదాల గురించి తెలియదు. తీరా కొన్నాక వివాదాలుంటే తీవ్ర వేదనకు గురవుతూ నష్టపోతూ కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. స్థిరాస్తిని అమ్మే వ్యక్తి న్యాయసమస్య గురించి చెప్పకపోయినా, ఉద్దేశపూర్వకంగా దాచిపెట్టినా కొనుగోలుదారునికి తెలిసే అవకాశం ప్రస్తుతమున్న చట్టంలో లేకపోవటం వల్ల అమాయక ప్రజలకు ఈ తీవ్ర నష్టం వాటిల్లుతోంది.

ఏ ఆస్తి రిజిస్ట్రేషన్‌లోనైనా ఈ రెండు అంశాలుండాలి:

1) ఎటువంటి ఆస్తి రిజిస్ట్రేషన్ చేయించుకున్నా అది స్పష్టమైన పట్టా గ్యారంటీ కావాలి.

2) పెండింగ్‌లో ఉన్న వ్యాజ్యాల వివరాలను కొనుగోలుదారులకు విధిగా అందించాలి. ఇటువంటి ఏర్పాట్లు లేకపోవటం వల్లే వేలాదిమంది న్యాయవివాదాల్లో చిక్కుకుని కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తోంది.

స్థిరాస్తి బదిలీ చట్టంలోని సెక్షన్ 52 ప్రకారం ప్రస్తుతం ఎవరైనా యాజమాన్య హక్కుపై వ్యాజ్యాల్లో ఉన్న ఆస్తిని కొనుగోలు చేస్తే కొనుగోలుదారుని హక్కు కోర్టు నిర్ణయం మీదే ఆధారపడివుంటుంది. జీవితకాలం కూడబెట్టిన డబ్బుతో కొనుగోలు చేసిన స్థిరాస్తి కోర్టు వివాదంలో ఉందని తెలియటం వల్ల కొనుగోలుదారునికి జీవితకాల షాక్‌ని ఎదుర్కోవలసి వస్తోంది. ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరిగాక పట్టా దక్కకపోవచ్చు.

ఈ సమస్యను అధిగమించటానికి మహారాష్ట్ర, గుజరాత్ ప్రభుత్వాలకు ఆస్తి బదిలీ చట్టంలోని 52వ సెక్షన్, ఇండియన్ రిజిస్ట్రేషన్ (బొంబే సవరణ) చటం, 1939కి రాష్ట్ర చట్టం ద్వారా సవరణ చేసి స్థిరాస్తిపై పెండింగ్ కేసులుంటే ఎన్‌కంబరెన్స్‌లతోపాటే సబ్‌రిజిస్ట్రార్ కొనుగోలుదారులకు తెలియచేయటం తప్పనిసరి చేశారు. సుప్రీంకోర్టు 2010లో ఈ చట్టాన్ని ఉటంకిస్తూ వ్యాజ్యాల్లో చిక్కుకున్న భూముల వల్ల కొనుగోలుదారులకు నష్టం లేకుండా వివరాలను వెల్లడించేందుకు ఇలాంటి సవరణనో లేదా తగిన ఇతర సవరణల్నో చేయాలని లా కమిషన్‌కి, పార్లమెంటుకి సూచించింది. ఏప్రిల్ 1998లో సమర్పించిన లా కమిషన్ కూడా ఈ రెండు సెక్షన్లకి సవరణల్ని సిఫార్సు చేసింది. ఈ సవరణ వల్ల తాను కొన్న స్థిరాస్తిపై వ్యాజ్యం పెండింగ్‌లో ఉందని తనకు తెలియదని కొనుగోలుదారులు వాదించే అవకాశం ఇక ఉండదని 2011లో గుజరాత్ హైకోర్టు వ్యాఖ్యానించింది. కొనేసమయంలోనే పెండింగ్ లిటిగేషన్ వివరాలు తెలియటం వల్ల తమ ప్రయోజనాలను కొనుగోలుదారులు పరిరక్షించుకోగలుగుతారు.

భూముల కొనుగోళ్లలో అనవసర లిటిగేషన్లను తొలగించి ప్రజల ప్రయోజనాలను కాపాడాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు సానుకూలంగా ఉన్నందున ఆస్తి బదిలీ చట్టం, 1882లోని సెక్షన్ 52ను, భారత రిజిస్ట్రేషన్ చట్టం, 1908 సెక్షన్ 17 లేదా 18ని సవరించాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

చట్ట సవరణ ముసాయిదాలను కూడా జతచేస్తున్నాం".

అభివాదాలతో,

డా॥ జయప్రకాష్ నారాయణ్

లోక్‌సత్తా ❐

# నల్లధనంపై యుద్ధానికి ఉగాది కొత్త స్ఫూర్తినివ్వాలి, మోదీ బృందం ధైర్యంగా ఈ సంస్కరణలను అమలుచేయాలి: జేపీ

నల్లధనంపై యుద్ధానికి ఇది అత్యంత అనుకూల సమయమని, ఈ పోరాటంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలు క్రియాశీల భాగస్వాములయ్యేందుకు ఈ ఉగాది కొత్త స్ఫూర్తినివ్వాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ శుభాకాంక్షలు తెలిపారు.

విదేశీ రహస్య ఖాతాల్లో భారతీయులకు 700 బిలియన్ డాలర్ల పైచిలుకు డబ్బు ఉందని, పనామాలోని మొసాక్ ఫోన్సెకా నుంచి బైటపడ్డ నల్లధన ఖాతాలు మచ్చుకు మాత్రమేనని జేపీ అన్నారు. అయితే పనామా పత్రాల్ని బైటపెట్టిన అవినీతి వేగులు రహస్యం మూతను ఛేదించి ప్రపంచానికి ఎంతో మేలు చేశారని అభినందించారు. దొంగ ఖాతాల నిర్వహణ ఇకమీదట అంత సులభం కాదన్నారు. ఇక చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత దేశాలదేనన్నారు. మరోవైపు, ప్రతిరోజూ మనదేశం నుంచి రూ.1000కోట్లకు పైగా డబ్బు అక్రమంగా తరలిపోతోందని, ఇందులో తెలుగు రాష్ట్రాల వాటా తక్కువేమీ కాదన్నారు. ఈ తరలింపుని అరికట్టి అందరికీ మంచి విద్య, వైద్యం, ఉపాధి అవకాశాల కోసం ఆ డబ్బును వినియోగించేలా తగిన సంస్కరణలను మనం వేగంగా సాధించుకోవాలన్నారు. మనదేశంలో 20,000 టన్నుల బంగారం రూపంలో వృధాగా పడివున్న సంపదను కూడా ప్రజాప్రయోజనాల కోసం సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇది పూర్తిగా ఆచరణసాధ్యమన్నారు. విదేశాల్లో రహస్య ఖాతాలపై పనామా పత్రాలు వెల్లడించిన వివరాల పట్ల కూడా మనం తగిన రీతిలో స్పందించకపోతే ఇది భేతాళ కథలాగా సాగిపోతూనే ఉంటుందన్నారు.

**నల్లధనం పెరగటానికి నాలుగు కారణాలున్నాయని చెబుతూ, వాటికి మన చేతుల్లోనే ఉన్న వ్యవస్థీకృత పరిష్కారాలను జేపీ వివరించారు..**

"నల్లధనం పెరగటానికి **మొదటి కారణం ఓట్ల కొనుగోలు:** ముఖ్యమంత్రుల్ని ఎమ్మెల్యేలు కాకుండా ప్రజలే ప్రత్యక్షంగా ఎన్నుకోవటం ఇందుకు కీలక పరిష్కారం.




**రెండో కారణం, పన్ను అవినీతి:** అత్యంత అవినీతిపరులైన అధికారులను నిర్దాక్షిణ్యంగా పదవి నుంచి తొలగించటం ఇందుకు విరుగుడు.

**మూడోది సాధారణ అవినీతి:** జాతీయ, రాష్ట్ర, స్థానిక స్థాయిలలో అధికారాలు, వనరులు ఉన్న లోక్‌పాల్–లోకాయుక్త–అంబుడ్స్‌మన్‌లను ఏర్పాటు చేయటం ఇందుకు పరిష్కారం.

**నల్లధనానికి నాలుగో కారణం రియల్ ఎస్టేట్:** స్టాంప్‌డ్యూటీని, మూలధన రాబడిని తగ్గించటం దీనికి వ్యవస్థీకృత పరిష్కారం".

ఈ పరిష్కారాలను విస్తృతంగా ప్రచారం చేయటంతోపాటు వీటిని అమలుచేసేలా కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ప్రత్యక్షంగా, ప్రజాప్రతినిధుల ద్వారా ప్రజలు కృషి చేయాలని జేపీ కోరారు. నల్లధనాన్ని అరికట్టాలనే నిబద్ధత, తపన ఉన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, ఆయన బృందానికి ఈ మార్పుల్ని అమలు చేయటానికి పనామా పత్రాల లీకు రూపంలో అత్యుత్తమ అవకాశం లభించిందని, నిజమైన అధికారం వారి చేతుల్లో ఉందని, ప్రపంచవ్యాప్తంగా పరిస్థితులు మద్దతు పలుకుతున్నాయని అన్నారు. మోదీ ప్రభుత్వం ధైర్యంగా ఈ వ్యవస్థీకృత సంస్కరణల్ని అమలుచేయాలనే గళం తెలుగువారి నుంచి పెద్దఎత్తున మొదలై దేశవ్యాప్తం కావాలని జయప్రకాష్ నారాయణ్ విజ్ఞప్తి చేశారు. ❑


2016 SUMMER INTERNSHIP PROGRAMME
@
FOUNDATION FOR DEMOCRATIC REFORMS
Focus Areas : Public Policy and Governance Reforms
Minimum duration : 5 weeks
Application Procedure : Online
http://www.fdrindia.org/new-fdr-internship-page/
APPLICATIONS UNDERWAY
LIMITED SLOTS
HURRY!!!

Posting Date 22-04-2016

RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2016-18 Published on April 16th 2016




| **Book-Post**<br>PRINTED MATTER | To |
| --- | --- |
| If not delivered please return to:<br><br>Lok Satta Times<br>Tulips Apartment,<br>6-3-655, Flat.No. 407,<br>Behind Civil Supplies Office,<br>Somajiguda<br>Hyderabad- 500082 | |

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad